నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

శుభ్రమైన బువ్వ, సూక్తివంటి పలుకు
రుచియు,తృప్తి నొసగు రుజువుగాను
బంధములను పెరుగు బ్రతుకునందు మనకు
విజయలక్ష్మి వాక్కు వినురనరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక 5 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 01-07-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00




# జూలైలోనూ వర్షాల లోటు

- ఐఎండీ ఆందోళన
- జూలైలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం: ఐఎండీ
- ఎల్‌నినో ప్రభావంతో వర్షాలకు బ్రేక్
- 125 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా జూన్‌లో లోటు వర్షపాతం
- ఖరీఫ్ సాగుపై ప్రతికూల ప్రభావం.. 23 శాతం తగ్గిన పంట విస్తీర్ణం
- ఆగస్టు, సెప్టెంబర్లలో మెరుగైన వర్షాల కోసం నిరీక్షణ

2 లో

జూలైలోనూ వానలు ముఖం చాటేయనున్నాయి..! 125 ఏళ్లలో ఐదో అత్యల్ప వర్షపాతానికి దేశం చేరువలో ఉండగా, ఎల్‌నినో ప్రభావంతో రైతుల్లో ఆందోళన పెరిగింది. జూన్‌లో ఇప్పటికే 39 శాతం వర్షలోటు నమోదుకాగా.. జూలైలో కూడా సాధారణం కంటే తక్కువ వర్షాలే కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. అయితే ఆగస్టు--సెప్టెంబరులో పరిస్థితి కొంత మెరుగయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది.



## తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు బాధ్యతలు

- సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన నూతన సీఎస్
- ఉద్యోగ విరమణ చేసిన కె. రామకృష్ణారావు
- 2029 ఫిబ్రవరి వరకు కొనసాగనున్న సంజయ్ జాజు సర్వీసు
- పరిపాలనా దక్షతతో పాటు కీలక ప్రాజెక్టులకు సారథ్యం

**హైదరాబాద్ జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా సంజయ్ జాజు మంగళవారం తన బాధ్యతలు స్వీకరించారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టే ముందు ఆయన ఎంసీహెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అక్కడి నుంచి నేరుగా సచివాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించిన కే. రామకృష్ణా రావు మంగళవారం ఉద్యోగ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో 1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సంజయ్ జాజును సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం జూన్ 26న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సంజయ్ జాజు నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖల విభాగాధిపతులు, సచివాలయ అధికారులు, సిబ్బంది ఆయనను పుష్పగుచ్ఛాలతో అభినందించారు.
2029 వరకు సర్వీస్‌లో.....

-మిగతా 2 లో

## రైతు సంక్షేమంపై అసెంబ్లీలో
# చర్చకు సిద్ధం

**పదేండ్ల మీ పాలన...
30 నెలల మా ప్రజా పాలనను సమీక్షిద్దాం**

- రైతుల కోసం 30 నెలల్లో రూ.1,75,000 కోట్లు ఖర్చుపెట్టాం
- కేంద్రమంత్రులు రాష్ట్రానికి ఒరగబెట్టిందేం లేదు
- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం కల్ల
- రైతు భరోసా నిధుల విడుదల సభలో సీఎం రేవంత్ రెడ్డి
- తొలి విడతగా రూ.2,482 కోట్లు విడుదల

"రైతు సంక్షేమంపై అసెంబ్లీలో బహిరంగ చర్చకు సిద్ధం.. బీఆర్‌ఎస్‌కు దమ్ముంటే రావాలి" అంటూ సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన, తమ 30 నెలల కాంగ్రెస్ పాలనను ప్రజల ముందే పోల్చుకుందామని ప్రకటించిన ఆయన.. రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్ అమలులో తమ ప్రభుత్వం చేసిన పనులన్నింటికీ లెక్క చెప్పేందుకు సిద్ధమని స్పష్టం చేశారు.



**హైదరాబాద్ జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతు సంక్షేమంపై ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ సభలో పదేండ్ల బీఆర్‌ఎస్ పాలన...30 నెలల ప్రజా ప్రభుత్వ పాలనపై చర్చిద్దామని చెప్పారు. దీనికి బీఆర్‌ఎస్ నేతలు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. మాజీ సీఎం కేసీఆర్ మాదిరిగా తాను అబద్ధాల పునాదుల మీద పరిపాలన చేయబోనని స్పష్టంచేశారు. తప్పయినా, ఒప్పయినా ఉన్నది ఉన్నట్టే చెప్తాననీ, చెప్పిందే చేస్తానని అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదిక

-మిగతా 2 లో



## నేటి నుంచి భారత్‌లో జపాన్ ప్రధాని పర్యటన

- ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు.. కీలక ఒప్పందాలకు సన్నాహాలు
- భారత్-జపాన్ సంయుక్త ఆర్థిక సదస్సులో పాల్గొననున్న నేతలు
- సెమీకండక్టర్లు, క్రిటికల్ మినరల్స్ సరఫరాపై ప్రత్యేక దృష్టి
- ఇండో-పసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు

**న్యూఢిల్లీ జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జపాన్ ప్రధాని సనాయే తకైచి ఇండియాలో పర్యటించనున్నారు. ఆమె జూలై 1 నుంచి 3 వరకు ఇండియాలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో భేటీ అవుతారు. జపాన్, ఇండియా మధ్య ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యాపార, సాంకేతిక సంబంధాల పురోగతి కోసం చర్చలు జరిపి ఒప్పందాలు కుదుర్చుకుంటారు. 2022 మార్చిలో జరిగిన ఇండియా–జపాన్ సదస్సు తర్వాత జపాన్ ప్రధాని ఇండియా రాబోతుండటం ఇదే తొలిసారి. జపాన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత

-మిగతా 2 లో



## సింధు జలాలపై పాక్ బెదిరింపులు

- తమ నీళ్లను ఎవరైనా వాడుకుంటే వారి చేతులు నరికేస్తామంటూ భారత్‌కు హెచ్చరిక
- ఒప్పందం రద్దుతో పాకిస్థాన్‌లో తీవ్ర నీటి కటకట
- రక్తం, నీరు కలిసి పారలేవు: ప్రధాని మోదీ
- చర్చలకు ఆస్కారం లేదన్న కేంద్రం
- ఎండిపోయిన సుక్కూర్ బ్యారేజ్
- బీడువారుతున్న బలూచిస్తాన్ వ్యవసాయ భూములు
- భారత్ నిర్ణయంతో కుదేలైన పాక్ ఆర్థిక వ్యవస్థ

**న్యూఢిల్లీ**
పాకిస్తాన్‌కు సింధు నది నీళ్లు ఇవ్వకూడదని భారత్ తీసుకున్న నిర్ణయం పాకిస్తాన్‌ను భారీ దెబ్బకొట్టింది. భారత సరిహద్దులోని పాక్ ప్రాంతాలు తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌ను పాకిస్తాన్ బ్రతిమిలాడాల్సింది పోయి.. బెదిరింపులకు దిగుతోంది. సింధు నదీజలాలు ఇవ్వకుంటే భారత్ అంతుచూస్తామంటూ హెచ్చరిస్తోంది. తాజాగా, పాకిస్తాన్ వాతావరణ శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్ కూడా భారత్‌ను బెదిరించాడు. సింధు నదీ జలాలు పాకిస్తాన్ నీళ్లు అంటూ చెప్పాడు. అంతేకాదు.. తమ నీళ్లను ఎవరైనా వాడుకుంటే వారి చేతులు నరికేస్తామంటూ పరోక్షంగా భారత్‌ను హెచ్చరించాడు.పాకిస్తాన్ సమాచార శాఖ మంత్రి అతౌల్లా తరార్ మాట్లాడుతూ సింధు నదీ జలాలను ఒక ట్యాప్ ద్వారా మన ప్రధానమంత్రి కంట్రోల్ చేస్తున్నారు అంటూ విమర్శించాడు. పాకిస్తాన్‌లోకి ఒక్క చుక్క నీళ్లు కూడా రాకుండా అడ్డుకుంటున్నారన్నాడు. ఇలా ఏకపక్షంగా ఒక దేశం నదీ జలాల ఒప్పందాన్ని

-మిగతా 2 లో

# పాక్‌లో మేం భాగం కాదు..

- పాకిస్థాన్‌కు పీవోకే నిరసనకారుల హెచ్చరిక
- ఆహార పదార్థాల నిలిపివేత కొనసాగిస్తే ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటాం
- "మాకు మీ రేషన్ అక్కర్లేదు.. పౌరులను శిక్షించడం ఆపండి"
- పాక్ రక్షణ మంత్రి వ్యాఖ్యలపై మండిపడిన స్థానికులు

**రావల్‌కోట్,**
పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటు మంగళవారం నాటకీయ మలుపు తీసుకుంది. పీవోకే పాకిస్థాన్‌లో భాగమే కాదంటూ నిరసనకారులు ప్రకటించారు. ఈ ప్రాంతానికి అత్యవసర ఆహార పదార్థాల నిలిపివేతను కనుక ఇస్లామాబాద్ కొనసాగిస్తే తాము ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకుంటామని వారు హెచ్చరించారు. ఉగ్రవాద వ్యతిరేక చట్టాల కింద పాకిస్థాన్ అధికారులు ఈ నెల ప్రారంభంలో జమ్ము

-మిగతా 2 లో





## ఖనిజ సంపదపై చంద్రబాబు మాస్టర్ ప్లాన్

- ఆదాయ పెంపే లక్ష్యంగా కీలక ఆదేశాలు
- రాష్ట్రంలో ఖనిజ నిల్వల గుర్తింపునకు మినరల్ మ్యాపింగ్ చేయాలి
- ఖనిజాలకు రాష్ట్రంలోనే విలువ జోడింపు ద్వారా ఆదాయం పెంచడంపై ప్రత్యేక దృష్టి
- అరుదైన ఖనిజాల వెలికితీతకు క్లస్టర్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచన
- టెక్నాలజీ వినియోగంతో ఉచిత ఇసుక సరఫరాను పటిష్టంగా పర్యవేక్షించాలని స్పష్టం చేసిన సీఎం

**అమరావతి:**
రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అపారమైన ఖనిజ సంపదను సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖనిజ నిల్వలను గుర్తించేందుకు సమగ్రమైన 'మినరల్ మ్యాపింగ్' చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేవలం ముడి ఖనిజాలను వెలికితీయడమే కాకుండా, వాటికి రాష్ట్రంలోనే విలువ జోడింపు (వాల్యూ యాడిషన్) ప్రక్రియలను ప్రోత్సహించడం ద్వారా గరిష్ట ప్రయోజనం పొందాలని స్పష్టం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు.

-మిగతా 2 లో



## ఫడ్నవిస్‌ను కలిసిన పవన్ కళ్యాణ్

- రెండు ఆడ పులులు ఇచ్చేందుకు అంగీకారం
- తూర్పు కనుమల్లో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్న పవన్
- ఏపీకి రెండు ఆడ పులులు ఇచ్చేందుకు ఫడ్నవిస్ ప్రభుత్వం అంగీకరించిందని వెల్లడి
- ఫడ్నవిస్‌కు ధన్యవాదాలు తెలిపిన డిప్యూటీ సీఎం పవన్

**అమరావతి:జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రస్తుతం ముంబైలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్... మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో సమావేశమయ్యారు. సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా తూర్పు కనుమల్లో పులుల సంరక్షణతో పాటు ఇరు రాష్ట్రాల పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గడం వల్ల సంతానోత్పత్తి వంటి జన్యుపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ఈ సమస్యను అధిగమించి, పులుల సంఖ్యను పెంచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఏపీకి రెండు ఆడ పులులను ఇచ్చేందుకు అంగీకరించిందని తెలిపారు.

-మిగతా 2 లో

## ఆశీర్వాద సభల పేరిట సీఎం రేవంత్
# నాటకాలు

**రూ. 30 వేల కోట్ల రైతు భరోసా నిధులు ఎగ్గొట్టారు**

- ప్రచారమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి పీఆర్ స్టంట్లు
- యూరియా కొరతపై దృష్టి మళ్లించేందుకే ఈ ఆర్భాటం
- ముదనష్టపు పాలనతో రైతన్నల గొంతు కోస్తున్న కాంగ్రెస్
- ఏడాదికి రూ. 15 వేల హామీ ఏమైంది?
- రుణమాఫీలోనూ అన్నదాతలకు ఘోర మోసం
- కేసీఆర్ 'రైతు బాంధవుడు'.. రేవంత్ 'రైతు ద్రోహి'
- సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం



**హైదరాబాద్ జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రంలో రైతు భరోసా నిధులు రూ.30 వేల కోట్లు ఎగ్గొట్టి రైతన్నలకు ఎగనామం పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ద్రోహిగా మిగిలిపోతారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న యూరియా కొరత రైతన్నల కష్టాల నుంచి దృష్టిమళ్లించడం కోసమే ఇప్పుడు ఆశీర్వాద సభల పేరుతో ముఖ్యమంత్రి నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఒక్క కంప్యూటర్ బటన్ నొక్కితే సరిపోయే రైతు భరోసా నామమాత్రపు నిధుల విడుదలకు ఆర్భాటంగా కేవలం ప్రచారమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి పిఆర్ స్టంట్లు చేస్తున్నారని

-మిగతా 2 లో

# జూలైలోనూ వర్షాల లోటు

-ఐఎండీ ఆందోళన
-జూలైలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం: ఐఎండీ
-ఎల్‌నినో ప్రభావంతో వర్షాలకు బ్రేక్
-125 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా జూన్‌లో లోటు వర్షపాతం
-ఖరీఫ్ సాగుపై ప్రతికూల ప్రభావం.. 23 శాతం తగ్గిన పంట విస్తీర్ణం
-ఆగస్టు, సెప్టెంబర్లలో మెరుగైన వర్షాల కోసం నిరీక్షణ



దేశంలో ఇప్పటికే వర్షపాతం లోటు కనిపిస్తోంది. జూన్‌లో తగినంతగా వర్షాలు కురవలేదు. జూలైలోనైనా భారీ వర్షాలు కురుస్తాయని ఆశిస్తున్న వారికి షాకిచ్చే ప్రకటన చేసింది భారత వాతావరణ సంస్థ ఐఎండీ. జూలైలో సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని ప్రకటించింది. పసిఫిక్ భూమధ్య రేఖ వద్ద ఎల్‌నినో బలపడటం వల్ల ఈ పరిస్థితి ఉంటుందని ఐఎండీ తెలిపింది. ఇప్పటికే జూన్‌లో 39 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. 1901 తర్వాత ఈ స్థాయిలో జూన్‌లో లోటు వర్షపాతం నమోదు కావడం ఇది ఐదోసారి. అంటే 125 ఏళ్లలో ఇంత తక్కువ వర్షపాతం నమోదైన ఐదు జూన్‌లలో ఇదీ ఒకటి. ఐఎండీ తాజా అంచనా ప్రకారం జూలైలో దేశంలోని అనేక ప్రాంతాల్లో తక్కువ వర్షపాతమే నమోదవుతుంది. సెంట్రల్ ఇండియా, ఉత్తర భారత, తూర్పు భారత్ ప్రాంతాల్లో లోటువర్షపాతమే ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం భారీ వర్షపాతమే నమోదయ్యే ఛాన్స్ ఉంది. వాయువ్య, తూర్పు-మధ్య, తూర్పు ప్రాంతాల్లో సాధారణం నుంచి భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. దేశంలో లోటు వర్షపాతం ఉండటంతో వ్యవసాయ రంగంలో అనిశ్చితి నెలకొంది. గత ఏడాదితో పోలిస్తే ఖరీఫ్ సాగు 23 శాతం తగ్గినట్లు కేంద్రం అంచనా వేస్తోంది. వర్షాలు కురవకపోవడంతో వరి, పప్పుధాన్యాలు, సోయాబీన్, పత్తి వంటి పంటలు ఎక్కువగా నాట్లు వేయలేదు. వర్షాకాలంలో నాలుగు నెలల్లో జూన్, జూలైలలో తక్కువ వర్షపాతమే నమోదవుతుంది. అయితే, ఆ తర్వాత నుంచి భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. ఆగష్టు, సెప్టెంబర్‌లలో మెరుగైన వర్షపాతం నమోదు కావొచ్చని ఆస్ట్రేలియాకు చెందిన వాతావరణ సంస్థ బ్యూరో ఆఫ్ మెటియోరాలజీ (బీఓఎం) తెలిపింది. కానీ, జూలైలో నమోదయ్యే వర్షపాతమే దేశంలో భారీ వర్షాలకు కారణమవుతుంది. వర్షాల లోటును తీరుస్తుంది. ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నా.. సాధారణ వర్షపాతమే నమోదవుతోంది.

## నేటి నుంచి భారత్‌లో జపాన్ ప్రధాని పర్యటన

మొదటి తరువాయి

తకైచి కూడా ఇండియాలో పర్యటించనుండటం కూడా ఇదే మొదటిసారి. ఈ మూడు రోజుల పర్యటన సందర్భంగా తకైచి.. ప్రధాని మోదీతో ఉన్నతస్థాయి చర్చలు జరిపి, ఇరు దేశాల మధ్య సహకారం, సమన్వయంపై ఒప్పందం కుదుర్చుకుంటారు. అనంతరం మోదీతో కలిసి ఇండియా-జపాన్ దేశాల సంయుక్త ఆర్థిక సదస్సులో పాల్గొంటారు. ఈ సదస్సులో భారత్, జపాన్‌లకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొంటారు. రెండు దేశాల మధ్య వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడుల అంశంపై చర్చిస్తారు. ఇండియా-జపాన్ మధ్య కొంతకాలంగా సంబంధాలు మెరుగుపడుతున్నాయి. ముఖ్యంగా 2014 నుంచి ఇరు దేశాలు ప్రపంచ వ్యూహాత్మక భాగస్వాములుగా కొనసాగుతున్నాయి. గత ఏడాది ఆగష్టులో ప్రధాని మోదీ జపాన్‌లో పర్యటించారు. రాబోయే దశాబ్దకాలంపాటు ఇరు దేశాలు ఎలా కలిసి పని చేయాలనే అంశంపై అవగాహనకు వచ్చారు. రక్షణ, భద్రతతోపాటు పెట్టుబడులు, వాణిజ్యం, సాంకేతికత, పౌర సంబంధాల విషయంలో చర్చలు జరిపారు. జపాన్ ప్రధాని తకైచి ప్రవేశపెట్టిన స్వేచ్ఛాయుత, ఇండో పసిఫిక్ దార్శనికతను ముందుకు తీసుకెళ్లడంలో ఇండియా కీలక భాగస్వామి అని జపాన్ భావిస్తుంది. సెమీ కండక్టర్లు, క్రిటికల్ మినరల్స్ సరఫరా విషయంలో కూడా ఒప్పందం కుదరనుంది. అలాగే, సముద్ర తీర రక్షణ, భద్రత విషయంలో కూడా రెండు దేశాలు కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు భారతీయ నిపుణుల్ని భారీ ఎత్తున జపాన్‌కు పంపించేందుకు కూడా ఒప్పందం కుదరవచ్చు.

## సింధు జలాలపై పాక్ బెదిరింపులు

మొదటి తరువాయి

రద్దు చేయడం తగదంటూ చెప్పుకొచ్చాడు. సింధు నదికి సంబంధించిన జలాల విషయంలో ఇండియా, పాక్ మధ్య దశాబ్దాలుగా ఒప్పందం ఉంది. అయితే, గత ఏడాది పహల్గాంలో ఉగ్రదాడుల తర్వాత ఈ ఒప్పందాన్ని ఇండియా రద్దు చేసింది. దీంతో పాకిస్తాన్‌కు సింధు నదీ జలాల పంపిణీని భారత్ నిలిపివేసింది. మిగులు జలాల్ని కూడా ఇండియానే వాడుకుంటోంది. దీనిపై పాక్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉన్నా, అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావిస్తూ ఉన్నా భారత్ మాత్రం వెనుకడుగు వేయడం లేదు. సింధు నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేయడం గురించి గత ఏడాది మోదీ మాట్లాడారు. తీవ్రవాదం, చర్చలు రెండూ ఒకేసారి ఉండవు అంటూ చెప్పారు. అలాగే, రక్తం, నీరు కలిసి పారలేవు అంటూ పేర్కొన్నారు. ఈ విషయంలో ఇండియా తన వైఖరి మార్చుకోబోదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇటీవల స్పష్టం చేశారు. భారత నిర్ణయం వల్ల పాకిస్తాన్ తీవ్రంగా నష్టపోతోంది. అక్కడి సుక్కుర్ బ్యారేజ్ దాదాపుగా ఎండిపోయింది. ఈ బ్యారేజ్ పాకిస్తాన్లోని సింధు నదిపై ఉంది. ఈ నదికి నీళ్లు ఇండియా నుంచే వెళ్తాయి. కానీ, ఇండియా నీళ్లను ఆపేయడంతో అక్కడ నది ఎండిపోయి కనిపిస్తోంది. ఈ నది నుంచి బలూచిస్తాన్లోని లక్షలాది వ్యవసాయ భూములకు నీరు అందేది. ఇప్పుడు ఆ భూములన్నీ బీడుబారుతున్నాయి. పాకిస్తాన్ సింధు నది నుంచి ఏర్పడ్డ కాలువల్లో కూడా నీటి ప్రవాహం తగ్గిపోయింది

## పాక్‌లో మేం భాగం కాదు..

మొదటి తరువాయి

కశ్మీర్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ)పై నిషేధం విధించడంతో ఆ సంస్థ ఆధ్వర్యంలో పీవోకేలోని రావల్‌కోట్ ఈద్గా గ్రౌండ్‌లో నిరసనకారులు తమ ఆందోళనను కొనసాగించారు. 'పీవోకేలోని రావల్‌కోట్, మీర్‌పూర్ నివాసితులు అసలైన కశ్మీరీలు కాదు' అంటూ పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల ప్రకటించడంపై వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా రేషన్, అత్యవసరాల సరఫరాలో ప్రభుత్వం కల్పిస్తున్న ఆటంకాల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌరులను పాకిస్థాన్ ప్రభుత్వ మూకుమ్మడిగా శిక్షిస్తున్నదని వారు ఆరోపించారు. 'మాకు మీ రేషన్ అక్కర్లేదు. మీకు మా సహాయం కావాలి' అనీ పీవోకే నేత సర్దార్ ఆమన్ ఖాన్ పేర్కొన్నారు. తమ సరుకుల సరఫరా నిలిపివేత ఇంకా కొనసాగిస్తే పౌరులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సి ఉంటుందని ఆయన పాక్ ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు.

# రైతు సంక్షేమంపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం

మొదటి తరువాయి

నుంచి రైతు భరోసా నిధులకు సంబంధించిన రూ.2,482 కోట్లను సీఎం రేవంత్‌రెడ్డి మీట నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేశారు. తద్వారా రెండెకరాల వరకు ఉన్న 41.37 లక్ష?ల మంది రైతులకు లబ్ది చేకూరుతుంది. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఎం మాట్లాడారు. రైతులు ఆత్మగౌరవంతో బతికేలా పరిపాలన సాగిస్తున్నామన్నారు. హైదరాబాద్ రాష్ట్రం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బూర్గుల రామకృష్ణారావు నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డి వరకు 19 మంది దాకా ముఖ్యమంత్రులు రాష్ట్రాన్ని పాలించినా కేవలం రూ.69 వేల కోట్లు మాత్రమే అప్పు చేశారనీ, మిగులు రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణను పదేండ్ల కేసీఆర్ హయాంలో రూ.8.11 లక్ష?ల కోట్లు అప్పులు చేసి ఊబిలోకి నెట్టేసి వెళ్లారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు జీతాలు కూడా వాయిదాల పద్ధతిలో ఇస్తున్నారని అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తనకు చెప్పారని గుర్తుచేసుకున్నారు. అందుకే తొలి క్యాబినెట్ సమావేశంలోనే రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అప్పు... ప్రత్యక్ష?ంగా, పరోక్ష?ంగా కార్పొరేషన్లు, శాఖలు, ఇతరత్రా రూపాల్లో తెచ్చిన అప్పులేంటో తేల్చాలని డిప్యూటీని సీఎం భట్టి విక్రమార్కను కోరితే తవ్వినకొద్దీ అప్పుల కుప్పలు బయటపడ్డాయని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు అందేలా చూడాలని సీఎస్‌ను ఆదేశించా నన్నారు. బడిపిల్లల బట్టలు, మధ్యాహ్నభోజన కార్మికులకు, సర్పంచులు, ఎంపీటీసీలు, కాంట్రాక్టర్లకు గత ప్రభుత్వం వేలకోట్లు బకాయిలు పెట్టిపోయిందని వివరించారు. మిగులుతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం



కేసీఆర్ పాలనలో బికారిగా మారిందని విమర్శించారు. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు తీసుకెళు _న్నామని చెప్పారు.

ఉచిత కరెంటూ.. రుణమాఫీ పేటెంట్ మాదే

'ప్రజాప్రభుత్వం 30 నెలల పాలనలో రూ.20,677 కోట్లతో రైతులకు రూ.2 లక్ష?ల రుణమాఫీ చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7 వేల కోట్ల రైతు బంధు బకాయిలను పెండింగ్‌లో పెడితే క్లియర్ చేశాం. రైతు భరోసాను రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచాం. గత ప్రభుత్వం సివిల్ సప్లయ్ శాఖ వద్ద రైతులకు ధాన్యం డబ్బులు బకాయి పెట్టి పోతే వాటిని క్లియర్ చేశాం' అని చెప్పారు. రైతు భరోసా కోసం ఇప్పటికే రూ.27 వేల కోట్లు ఖర్చుపెట్టామనీ, ఇప్పుడు మరో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేయబోతున్నామన్నారు. ఈ ఒక్క పథకానికే ఇప్పటివరకు రూ.36 వేల కోట్లు ఖర్చుచేశామని వివరించారు. ఉచిత కరెంటు, రుణమాఫీ పథకాలకు పేటెంట్ కాంగ్రెస్‌పార్టీనే అని చెప్పారు. పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం సివిల్ సప్లయ్ శాఖ ద్వారా రూ.1.68 లక్ష?ల కోట్ల వడ్లను కొంటే...30 నెలల కాలంలోనే ప్రజా ప్రభుత్వం రూ.80 వేల కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసిందని తెలిపారు. ఃఇప్పటిదాకా రూ. 1.75 లక్ష?ల కోట్లను రైతుల కోసం ఖర్చుపెట్టామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి నెలా రైతుల కోసం రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తే, తాము రూ.6వేల కోట్లు ఖర్చుచేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. లక్ష? కోట్ల రూపాయలు పెట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయ్యిందన్నారు. మూడేండ్ల నుంచి కాళేశ్వరం నుంచి చుక్క నీరు తీసుకోకపోయినా రాష్ట్రంలో 2.88 లక్ష?ల మెట్రిక్ టన్నుల వడ్లను పండించిన ఘనత తెలంగాణ రైతాంగానికి దక్కుతుందని కొనియాడారు. కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పిల్ల రాక్ష?సులు కాశీమజిలీ కథలతో మళ్లీ తప్పుడు ప్రచారాలు చేస్తే నమ్మే స్థితిలో జనం లేరని అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ హయాంలో దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, కోటి ఎకరాలకు సాగు నీరు వంటి హామీలను ప్రస్తావించారు.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు బాధ్యతలు

మొదటి తరువాయి

మధ్యప్రదేశ్‌కు చెందిన తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో కొనసాగనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, కేంద్ర సర్వీసుల్లో ఆయన కీలక బాధ్యతలు నిర్వర్తించారు. మెకానికల్ ఇంజినీరింగ్?లో ఎంటెక్, ఎంబీఏ ఫైనాన్స్ పూర్తి చేశారు. క్షేత్రస్థాయి పోస్టులతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాలనాపరమైన ఉన్నత హోదాల్లో పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. ఈ గవర్నెన్స్, పరిపాలనలో డిజిటల్ వినియోగంపై సంజయ్ జాజుకు పట్టుంది. 'మీ సేవ'ను అందుబాటులోకి తీసుకురావటంలో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి కేంద్ర సర్వీసుల్లో ఉన్న సంజయ్ జాజు 2014 నుంచి 2018 వరకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా పని చేశారు. ఆ తర్వాత ఐదేండ్లపాటు రక్షణ శాఖలో జాయింట్ సెక్రెటరీ, అదనపు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. రెండేండ్ల నుంచి ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్న ఆయన ఇటీవలే తెలంగాణ కేడర్‌కు తిరిగి వచ్చారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక సీఎస్‌గా, కీలకమైన ప్రాజెక్టులను పర్యవేక్షించేందుకు సీఎంవోలో ఏర్పాటు చేసిన స్పీడ్ విభాగం సీఈవోగా, ఇండస్ట్రీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సెల్ ప్రత్యేక సీఎస్‌గా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు.

# ఆశీర్వాద సభల పేరిట సీఎం రేవంత్ నాటకాలు

మొదటి తరువాయి

మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొన్నటిదాకా పంట కొనుగోళ్ల సంక్షోభం ఇప్పుడు యూరియా కష్టాలు మరోవైపు కమ్ముకు వస్తున్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర రైతన్నలు తీవ్రమైన కష్టాల్లో ఉన్నారని తెలిపారు. ఎగవేతల రేవంత్ రెడ్డి ఇప్పుడు సంబరాలు చేసుకుంటున్న తీరును చూసి రాష్ట్ర రైతన్నలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 30 నెలల పాలన 'ముదనష్టపు పాలన'అని కేటీఆర్ విమర్శించారు. వ్యవసాయాన్ని దండగలా మార్చి రైతుల గొంతు కోస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్న గ్యారెంటీలతో గారడీ చేసి అధికారంలోకి వచ్చాక ఒకటి, రెండు ఎకరాలకే అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా నాలుగుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని తెలిపారు. దాదాపు 70 లక్షల మంది రైతుల ఉసురు పోసుకుంటున్నారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి రైతన్నలకు చేస్తున్న ద్రోహాన్ని రైతులు మర్చిపోతారనుకోవడం అవివేకమేనని హెచ్చరించారు. రూ. 50 వేల కోట్లతో పూర్తి చేయాల్సిన రూ.రెండు లక్షల రుణమాఫీని కనీసం పావలా వంతు కూడా చేయకుండా అన్నదాతలను రేవంత్ సర్కార్ మోసం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 72 సార్లు చేసిన ఢిల్లీ టూర్లకు, పనికిరాని సభలకు పెడుతున్న రూ.కోట్లాది ఖర్చును ఆదా చేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేదని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు యూరియా దొరక్క అల్లాడుతున్నారని కేటీఆర్ తెలిపారు. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్నదని తెలిపారు. పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా తప్పుకోవడం వారి చేతకానితనానికి నిదర్శనమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయం పండగలా సాగిందని గుర్తుచేశారు. కేసీఆర్ టంచన్‌గా 11 సార్లు, సుమారు రూ.73 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో కేసీఆర్ ఎప్పటికీ 'రైతు బాంధవుడి'గా నిలిచిపోతారని తెలిపారు. కానీ రైతులకు వెన్నుపోటు పొడిచిన రేవంత్ రెడ్డి మాత్రం 'రైతు ద్రోహి'గానే మిగిలిపోతారని పేర్కొన్నారు.

# ఆర్మీ నూతన చీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్



న్యూఢిల్లీ
ఆర్మీ స్టాఫ్ నూతన చీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సాయుధ దళాలలో 40 ఏళ్లకు పైగా కెరీర్ కలిగిన జనరల్ సేథ్ పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో విజయ వంతంగా నిర్వహించిన రెండు ఆపరేషనల్ ఆర్మీ కమాండ్‌లకు నాయకత్వం వహించారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో సేథ్ బాధ్యతలు స్వీకరించారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది మంగళవారమే పదవీ విరమణ చేశారు. కాగా, జనరల్ సేథ్ ఖడక్‌వాస్లాలోని జాతీయ రక్షణ అకాడమీ పూర్వ విద్యార్థి. డిసెంబర్ 1986లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో నియమితు లవ్వడంతో భారత సైన్యంలో ప్రవేశించారు. ఈ నలభై ఏళ్లలో అనేక హోదాల్లో పనిచేశారు. ఆర్మీ కమాండర్‌తో పాటు జైపూర్‌లోని సౌత్ వెస్ట్రన్ కమాండ్, సదరన్ కమాండ్‌లకు జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా పనిచేశారు. ఈ సమయంలోనే పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో రెండు ఆపరేషనల్ కమాండ్‌లకు నాయకత్వం వహించిన అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. తరువాత 31వ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ (సిఓఎఎస్), వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా పనిచేశారు.

## ఫడ్నవిస్‌ను కలిసిన పవన్ కళ్యాణ్

మొదటి తరువాయి



ఈ సందర్భంగా పెద్దమనసుతో సహకారం అందిస్తున్న మహారాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌కు పవన్ కళ్యాణ్ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయం వల్ల తూర్పు కనుమల్లో జన్యు వైవిధ్యం పెరిగి, దీర్ఘకాలిక స్థిరత్వంతో కూడిన ఆరోగ్యకరమైన, స్వయం సమృద్ధి గల పులుల ఆవాస వ్యవస్థ ఏర్పడుతుందని పవన్ కళ్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. వన్యప్రాణి సంరక్షణలో తమకు నిరంతరం మార్గదర్శకత్వం వహిస్తున్న కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు కూడా ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శాస్త్రీయ విధానాలతో జీవ వైవిధ్య పరిరక్షణకు ఇరు రాష్ట్రాలు కట్టుబడి ఉన్నాయని, భవిష్యత్తులోనూ కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి మరింత సమన్వయంతో ముందుకు సాగుతామని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు

## ఖనిజ సంపదపై చంద్రబాబు మాస్టర్ ప్లాన్

మొదటి తరువాయి

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "దేశంలోని కొన్ని రాష్ట్రాలు కేవలం ఖనిజాల ద్వారా ఆదాయంతోనే రెవెన్యూ మిగులు సాధిస్తున్నాయి. మన రాష్ట్రంలోనూ ఖనిజ సంపదకు మార్కెట్ క్యాపిటలైజేషన్ ద్వారా విస్తృత అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీఎండీసీ ద్వారా ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలి. దీనిపై నిపుణులతో అధ్యయనం చేయించి, ఒక పటిష్టమైన విధానాన్ని రూపొందించాలి" అని అన్నారు. బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము, మాంగనీస్, అల్యూమినా వంటి ఖనిజాలకు ఇక్కడే విలువ జోడింపు ప్రక్రియలు జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

## డ్యామ్ కట్టపై వాకర్స్ సమస్యల పరిష్కారానికి హామీ



**కరీంనగర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
డ్యామ్ కట్టపై చెట్లు, ముళ్లపొదలు విరివిగా పెరగడం వల్ల వాకర్స్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయని, పాములు, క్రిమికీటకాలు వస్తున్నాయని వాకర్స్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం వాకింగ్‌కు వచ్చిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని కలిసిన వారు సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు సంవత్సరాల క్రితం కూడా ఇలాంటి పరిస్థితి ఏర్పడినప్పుడు చెట్లు, ముళ్లపొదలను తొలగించామని, త్వరలో మళ్లీ తొలగించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## మేయర్‌కు బీజేపీ జాతీయ అధ్యక్షుడి అభినందనలు



**కరీంనగర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: హైదరాబాద్‌లో జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకుని మేయర్ పీఠాన్ని దక్కించుకున్నందుకు నితిన్ నబిన్ ఆయనను శాలువాతో సన్మానించి అభినందించారు.నగరాభివృద్ధికి కృషి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించిన నితిన్ నబిన్, కరీంనగర్ కార్పొరేషన్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అలాగే బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పరిశీలకుడు సునీల్ బన్సల్‌ను కూడా మేయర్ కలిశారు. నగర కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, జాతీయ అధ్యక్షుడు స్వయంగా అభినందించడం మరిచిపోలేని అనుభూతి అని, వారి సూచనలను శిరసావహించి నగరాన్ని రాష్ట్రంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రస్తుతం స్మార్ట్ సిటీ, అర్బన్ డెవలప్మెంట్ నిధులతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి డివిజన్ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా అలయన్స్ గ్రీన్ పోస్టర్ అవార్డ్స్ ప్రారంభం



**కరీంనగర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు "అలయన్స్ గ్రీన్ పోస్టర్ అవార్డ్స్" పోస్టర్ డ్రాయింగ్ పోటీని శ్రీ సరస్వతి శిశు మందిర్ (సీబీసీ) పాఠశాలలో ఘనంగా ప్రారంభించారు.అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్, వాసుదేవా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలో 4--8 సంవత్సరాలు, 9--13 సంవత్సరాల వయో విభాగాల్లో విద్యార్థులు పాల్గొనవచ్చు. జూలై 13లోపు పోస్టర్లను జిల్లా గవర్నర్ కార్యాలయానికి సమర్పించాలి. ఎంపికైన ఉత్తమ చిత్రాలు అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపబడతాయి.విజేతలకు నగదు బహుమతులు ఇవ్వనున్నారు --- మొదటి బహుమతి ?25,000, రెండో బహుమతి ?15,000, మూడో బహుమతి ?5,000. ఎంపికైన చిత్రాలు అలయన్స్ ఇంటర్నేషనల్ మ్యాగజైన్స్‌లో ప్రచురించే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, డాక్టర్ సౌమ్య, జిల్లా గవర్నర్ కొంజర్ల మహేష్, ఇంజనీర్ కోలా అన్నారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రణధీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునికి ఘన సన్మానం



**కరీంనగర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జమ్మికుంట ఆర్యవైశ్య సంఘం కొత్తగా ఎన్నికైన పట్టణ అధ్యక్షుడు లింకలపల్లి శరత్‌కుమార్‌ను వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ పీఎస్‌టీ సభ్యులు ఐత శ్రీలత, చౌక్కారపు జ్యోతి, మద్ది సురేఖ, చైర్‌పర్సన్ స్వామిశెట్టి అఖిలాండం పాల్గొన్నారు.ఈ సందర్భంగా శరత్‌కుమార్ మాట్లాడుతూ, ఆర్యవైశ్య సంఘానికి వాసవి వనిత క్లబ్ ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని తెలిపారు.

# జాతీయ వైద్యుల దినోత్సవం - ప్రాణరక్షకులకు ప్రణామం

జూలై 1న దేశవ్యాప్తంగా జరుపుకునే జాతీయ వైద్యుల దినోత్సవం వైద్యుల అంకితభావం, త్యాగం, మానవతా సేవలను స్మరించుకునే ప్రత్యేక దినంగా నిలుస్తోంది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ రాత్రింబవళ్లు సేవలందించే వైద్యుల కృషికి కృతజ్ఞతలు తెలిపే రోజు ఇది. ఈ దినోత్సవాన్ని భారతరత్న డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ జయంతి, వర్ధంతి సందర్భంగా నిర్వహించడం విశేషం. ప్రముఖ వైద్యుడు, విద్యావేత్త, ప్రజా నాయకుడైన ఆయన ప్రజారోగ్య సేవల విస్తరణలో విశిష్ట కృషి చేసి భారతరత్న పురస్కారంతో గౌరవించబడ్డారు. 2026 సంవత్సరానికి జాతీయ వైద్యుల దినోత్సవం థీమ్ మాస్క్ వెనుక: స్వస్థత చేకూర్చేవారికి ఎవరు స్వస్థత చేకూరుస్తారు? వైద్యుల శారీరక, మానసిక, భావోద్వేగ ఆరోగ్యంపై సమాజం దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. రోగులను కాపాడే వైద్యులకు కూడా విశ్రాంతి, కుటుంబ సహకారం, మానసిక ప్రశాంతత అవసరమనే సందేశాన్ని ఇది తెలియజేస్తోంది. వైద్య వృత్తి కేవలం చికిత్స అందించడం మాత్రమే కాదు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా నిర్ణయాలు తీసుకోవడం, రోగులకు ధైర్యం చెప్పడం, కుటుంబ సభ్యులకు ఆశ కల్పించడం,




ఒత్తిడిని తట్టుకుని నిరంతరం సేవలు అందించడం వంటి ఎన్నో బాధ్యతలను వైద్యులు నిర్వర్తిస్తారు. అందుకే వారిని సమాజం ప్రాణాలను కాపాడే దేవుళ్లుగా గౌరవిస్తుంది. మార్చి 2026 నాటికి దేశంలో 13.88 లక్షలకుపైగా నమోదిత అల్లోపతి వైద్యులు ఉన్నారు. పెరుగుతున్న జనాభా, కొత్త వ్యాధులు, ఆరోగ్య సేవలపై పెరుగుతున్న డిమాండ్ కారణంగా వైద్యులపై పని భారం అధికమవుతోంది. తెలంగాణలో కూడా ప్రభుత్వం ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తోంది. కోవిడ్-19 మహమ్మారి సమయంలో వైద్యులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అహర్నిశలు శ్రమించి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యుల సేవలను గౌరవించడం అంటే మానవత్వాన్ని గౌరవించినట్లేనని, వారి ఆరోగ్యం, సంక్షేమంపై సమాజం బాధ్యత వహించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**వ్యాసకర్త**
**వేల్పుల మహేందర్,**
**ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంఈడి,**
**అధ్యాపకులు**



## క్రిటికల్ కేర్ ఆసుపత్రిపై ఏఐవైఎఫ్ నిరసన




**కరీంనగర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ భవనం పేరుకే ఉందని, అత్యవసర వైద్య సౌకర్యాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపల్లి యుగంధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి ముందు ఏఐవైఎఫ్ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. యుగంధర్ మాట్లాడుతూ ఎమ్ఆర్ఐ, సిటిస్కాన్, డిజిటల్ ఎక్స్‌రే వంటి విభాగాలకు అనుభవజ్ఞులైన సిబ్బందిని నియమించాలని, అత్యవసర వైద్యానికి తగిన పరికరాలు, వైద్య బృందం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రోగులకు అత్యవసరమైతే వరంగల్ ఎంజీఎమ్ లేదా హైదరాబాద్ ఎయిమ్స్, నిమ్స్‌కు తరలిస్తున్నారని విమర్శించారు. కాంట్రాక్టర్ అరాచకాలు, శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాలను కాంట్రాక్ట్ సంస్థలకు అప్పగించడం వల్ల సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోందని ఆరోపించారు. అవసరమైతే కాంట్రాక్ట్ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కాన్ సెంటర్, ఆర్వో వాటర్ ప్లాంట్, ఏటీఎం సెంటర్ ఏర్పాటు చేయాలని, ఉచిత డెడ్ బాడీ వాహనాలు, కొత్త ఫ్రీజర్లు అందుబాటులోకి తేవాలని ఆయన సూచించారు. ఆసుపత్రిపై స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాలని యుగంధర్ కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో నగర కార్యదర్శి చెంచల మురళి, మాడిశెట్టి అరవింద్, ఆడెపు శ్రీనివాస్, రాజు, నరహరి ప్రేమలత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## హమాలి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ డిమాండ్



**కరీంనగర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా ఐరన్ అండ్ హార్డ్‌వేర్ హమాలి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్రంలోని అన్ని రంగాల హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ డిమాండ్ చేశారు.మంగళవారం నగరంలోని గంజ్‌లో హమాలి కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తక్కువ కూలి ఇచ్చి ఇతర రాష్ట్రాల కార్మికులకు పని కల్పించడం వల్ల స్థానిక హమాలి కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, లారీలు దించేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నందున వారికి ప్రమాద బీమా, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో జరగనున్న రాష్ట్ర మహాసభల్లో హమాలి కార్మికుల సమస్యలపై తీర్మానం చేసి, అవసరమైతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆగయ్య, ఉపాధ్యక్షుడు చింతనిప్పుల సాయిలు, కార్మికులు పెంచాల సంపత్, కొమ్మ వెంకటేశ్, జక్కుల రాములు, కూకట్ల సంపత్, కొట్టే సంపత్, శీలం మధునయ్య, తాని శ్రీనివాస్, బండారి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు డిస్కం నిర్ణయంపై ధర్నా



**కరీంనగర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
టీజీ ఆర్ పీడీసీఎల్ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించాలంటూ సిఐటియు, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయు ఆధ్వర్యంలో కరీంనగర్ విద్యుత్ సర్కిల్ ఆఫీస్ వద్ద ధర్నా జరిగింది.సిఐటియు జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి మాట్లాడుతూ, కొత్త రైతు డిస్కం ఏర్పాటు ప్రైవేటీకరణకు దారి తీస్తుందని, క్రాస్ సబ్సిడీ రద్దై గృహ వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం పడుతుందని పేర్కొన్నారు. కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ చట్టం 2025లోని నిబంధనలతో ప్రిపెయిడ్ మీటర్లు, అధిక చార్జీలు విధించే అవకాశం ఉందని అన్నారు.ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు వర్ణ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ఈ నిర్ణయం రైతాంగం, చిన్న వ్యాపారులు, పరిశ్రమలు, కార్మికులు, సాధారణ వినియోగదారులపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. రూ.45 వేల కోట్ల అప్పుల్లో రూ.35 వేల కోట్లు కొత్త డిస్కంకు బదిలీ చేయడం ఉచిత కరెంటు, నీటి సరఫరా వ్యవస్థలకు ఆటంకం కలిగిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్ద నాలా పూడిక తొలగింపు , దోమల నివారణ చర్యలు



**కరీంనగర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గణేష్ నగర్ 57వ డివిజన్ పరిధిలోని బైపాస్ రోడ్డులో స్వాతి చికెన్ సెంటర్ నుండి హైదరాబాద్ మెయిన్ రోడ్ వరకు ఉన్న పెద్ద నాలా చెత్త, చెదారంతో నిండిపోవడంతో దుర్వాసన వ్యాపించి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.స్థానిక కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ శ్రీనివాస్ తక్షణ చర్యలు తీసుకుని వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించకుండా పెద్ద నాలా పూడిక తొలగింపు పనులను పర్యవేక్షించారు. అదేవిధంగా దోమల నివారణకు కెమికల్ పొగ మస్కిటో ఫాగింగ్ నిర్వహించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్పొరేటర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీశైలం దేవస్థానానికి వెండి నాగాభరణం సమర్పణ





**శ్రీశైలం, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా నాదర్గుల్‌కు చెందిన పి. రవీందర్ కుటుంబ సభ్యులతో కలిసి అయిదు శిరస్సులతో కూడిన వెండి నాగాభరణం, వెండి చెంబును శ్రీశైలం దేవస్థానానికి సమర్పించారు. ఈ ఆభరణం, చెంబు కలిపి మొత్తం బరువు 416 గ్రాములు.ఆలయ ఆశీర్వచన మండపంలో దాతలు ఈ సమర్పణను ఆలయ పర్యవేక్షకులు గంజి రవి, ఉపప్రధానార్చకులు బి. వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, ఆలయ ఇన్‌స్పెక్టర్ కె. మల్లికార్జున, గుమాస్తా సావిత్రిలకు అందజేశారు. అనంతరం వారికి తగు రశీదు అందజేసి, వేదాశీర్వచనంతో స్వామి అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

## బలహీన వర్గాలకు రక్షణ కల్పించాలని ఆర్‌పిఐ డిమాండ్




కరీంనగర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రాష్ట్రంలో కులవివక్ష కొనసాగుతుందని, బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందడం లేదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా కార్యాలయంలో జరిగిన ఆర్‌పిఐ జిల్లా సదస్సులో ఆయన మాట్లాడుతూ, నిరుపేదల సమస్యలపై పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కొన్ని కులాలు వివక్షకు గురవుతున్నాయని, వారికి ప్రభుత్వం ద్వారా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మానసిక, శారీరక దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కోసం ఆర్‌పిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వం వెంటనే బలహీన వర్గాలు, మహిళలకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మొగురం మీరియా, జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజయ్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కారుకూరి శ్రీనివాస్, తడిగొప్పుల వినోద్ కుమార్, అశోక్ రెడ్డి, కొమురయ్య ముదిరాజ్, మహమ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బంగారు స్వామినాథం వర్ధంతి కార్యక్రమం



కరీంనగర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) టీఎన్జీవోల మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కీర్తిశేషులు బంగారు స్వామినాథం వర్ధంతి సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీఎన్జీవోల రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ స్వామినాథం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా, తాలూకా నాయకులు, ఉద్యోగ సంఘ ప్రతినిధులు కూడా ఘనంగా నివాళులు సమర్పించారు. మారం జగదీశ్వర్ మాట్లాడుతూ, స్వామినాథం ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం జీవితాంతం పోరాటం చేసిన మహోన్నత నాయకుడని, ఉద్యోగ సంఘాల భవనాల నిర్మాణానికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ఆత్మగౌరవం, ఉద్యోగుల స్వాభిమాన పరిరక్షణ కోసం ఆయన అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని, అధికారులను, పాలకులను ధైర్యంగా ప్రశ్నించిన ధీశాలి నాయకుడని కొనియాడారు. స్వామినాథం చూపిన మార్గం, ఆశయాలు, విలువలు నేటి తరానికి ఆదర్శప్రాయమని, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, తెలంగాణ ఉద్యోగుల ఆత్మగౌరవం కోసం అదే స్ఫూర్తితో టీఎన్జీవోలు నిరంతరం పనిచేస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, తాలూకా నాయకులు, వివిధ శాఖల ఉద్యోగులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామినాథానికి ఘనంగా నివాళులు అర్పించారు.

## రైతులకు ఆయిల్‌పామ్ సాగులో లాభాలు



గన్నేరువరం, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : గన్నేరువరం మండలంలోని ఏడుగురు రైతులు కట్ చేసిన ఆయిల్‌పామ్ గెలలను ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ సేకరించి, సిద్దిపేట జిల్లా నర్మెట్టలోని ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి తరలించారు. ఒక టన్ను ఆయిల్‌పామ్ గెలలకు రూ.23,852 రేటు లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అధిక దిగుబడి, మెరుగైన ఆదాయం ద్వారా ఆయిల్‌పామ్ సాగు రైతుల అభివృద్ధికి దోహదం చేస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ కిరణ్మయి, ఫీల్డ్ అధికారి యేసుమణి, రైతులు రమణారెడ్డి, నర్సింహారెడ్డి, తిరుపతి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎస్టి యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

కరీంనగర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) నిరుద్యోగ షెడ్యూల్డ్ తెగల యువతీ యువకుల కోసం తెలంగాణ ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. బిటీఈఎస్, లాజిస్టిక్స్, టెలికాం, వ్యవసాయం, దుస్తుల తయారీ, గృహోపకరణాలు, అందం ఉ సంరక్షణ, ఆటోమేషన్, ఎలక్ట్రానిక్స్, హెల్త్‌కేర్, రిటైల్, టూరిజం ఉ హాస్పిటాలిటీ రంగాల్లో శిక్షణ ఇవ్వబడుతుంది. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాల కోసం ప్లేస్‌మెంట్ అసిస్టెన్స్ కూడా కల్పించబడుతుంది. ఆసక్తి గల నిరుద్యోగ ఎస్టి యువతీ యువకులు దరఖాస్తు ఫారముల కోసం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం, కరీంనగర్‌ను సంప్రదించవచ్చు. పూర్తి వివరాలకు 944117482 నంబరులో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిని సంప్రదించవచ్చు.

## చేనేత సంఘం విజేతలకు గంగుల అభినందనలు



కరీంనగర్ రూరల్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) కొత్తపల్లి చేనేత సహకార సంఘ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులైన అభ్యర్థులు ఘన విజయం సాధించారు. నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన విజేతలకు శాలువాలు కప్పి సన్మానించి, మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. చేనేత సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దూస మునీందర్, ఉపాధ్యక్షుడు నడిమెట్ల చంద్రమౌళి, కోశాధికారి సిరిపురం హనుమండ్లు, డైరెక్టర్లు ఎలిగేటి రాజేశం, కోడూరి రాజేశం, బీఆర్ఎస్ నాయకులు జమీల్ ఉద్దీన్, ఎస్‌కే బాబా, రాంబాబు, శ్రీకాంత్, ఫక్రుద్దీన్, సుధాకర్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలీస్ అధికారుల పదవీ విరమణ వేడుకలు




కరీంనగర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం సేవలందించిన ఏడుగురు అధికారులు మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా సన్మాన కార్యక్రమం జరిగింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్గౌస్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ చేసిన అధికారులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ, సమాజ రక్షణలో పోలీస్ ఉద్యోగం అత్యంత బాధ్యతాయుతమైనదని, విధినిర్వహణలో చూపిన క్రమశిక్షణ యువ పోలీసులకు ఆదర్శమని పేర్కొన్నారు. విశ్రాంత జీవితాన్ని కుటుంబంతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ చేసినవారిలో ఎస్సైలు మహమ్మద్ ఇర్ఫాన్, బుర్ర ఎల్లయ్య గౌడ్, మొగురం సుధాకర్, బి. అంజయ్య, హెడ్ కానిస్టేబుళ్లు జి. వెంకటస్వామి, తోట మల్లయ్య, జి. ఉపేందర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, రిజర్వు ఇన్స్పెక్టర్ కిరణ్, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అమరుల స్థూపం స్థలంపై జేఏసీ వినతి



హుస్నాబాద్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హుస్నాబాద్ అమరుల స్థూపం స్థలాన్ని కబ్జాదారుల నుండి కాపాడి అమరుల స్మృతి వనం ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు సర్వాయి పాపన్న, గోనెల పాపన్న, బుచ్చన్న, అనభేరి ప్రభాకర్ రావు వంటి తెలంగాణ సాయుధ పోరాట యోధుల విగ్రహాలు, వారి చరిత్రను ప్రతిబింబించే స్మారక స్థూపం, క్రీడామైదానం, ఆడిటోరియం నిర్మించాలని కోరారు. సర్వే నంబర్లు 1189, 275లోని సీలింగ్ భూమిపై విచారణ జరిపి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మా రెడ్డి, కో కన్వీనర్లు మేకల వీరన్న యాదవ్, ధ్యాగల సారయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపే మల్లేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండి అన్వర్, లోకసత్తా జిల్లా బాధ్యులు మల్లారెడ్డి మోహన్ రెడ్డి, ఓపీడీఆర్ రాష్ట్ర నాయకులు విలసాగరం గోవర్ధన్, కాంగ్రెస్ నాయకులు జెరిపోతుల ఆంజనేయులు, పొన్నాల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీఓ శశికళకు ఘనంగా ఆత్మీయ సన్మానం



పాలకుర్తి, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) సుదీర్ఘకాలం వివిధ హోదాల్లో సేవలందించి పేరు ప్రఖ్యాతులు సంపాదించిన పాలకుర్తి మండల ఎంపీడీఓ పోలసాని శశికళ మంగళవారం పదవీ విరమణ చేశారు. గోదావరిఖని మాతంగి కాలనీ ఆర్‌ఆర్ గార్డెన్స్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై శశికళను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శశికళ అంకితభావంతో నిజాయితీగా విధులు నిర్వహించి పాలకుర్తి మండలానికి ఎనలేని సేవలందించారని ప్రశంసించారు. పదవీ విరమణ వయసుకే కాని మనస్సుకు కాదని, ఆమె అనుభవం సమాజానికి ఎల్లప్పుడూ ఉపయోగపడాలని ఆకాంక్షించారు. శశికళ మాట్లాడుతూ, 1987లో ఆదిలాబాద్ జిల్లా పరిషత్‌లో టైపిస్టుగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి 39 ఏళ్లపాటు అనేక కార్యాలయాల్లో సేవలందించానని, పాలకుర్తి మండలంలో పదవీ విరమణ చేయడం మర్చిపోలేని అనుభూతి అని తెలిపారు. తోటి అధికారులు, సిబ్బంది సహకారం వల్ల ప్రజలకు సక్రమంగా సేవలందించగలిగానని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య నాయకులకు రాష్ట్ర మహాసభలో స్థానం



కరీంనగర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, పల్లెర్ల రాజ్ కిరణ్‌లను రాష్ట్ర మహాసభ అసోసియేట్ కార్యవర్గ సభ్యులుగా నియమించారు. ఈ నియామకంతో కరీంనగర్ ఆర్యవైశ్య సభ్యులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఓపెన్ స్కూల్ ఎస్ఎస్సీ, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

కరీంనగర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2026--27 విద్యాసంవత్సరానికి ఎస్-ఎస్సీ, ఇంటర్ ప్రవేశాల దరఖాస్తు షెడ్యూల్ విడుదల చేసింది. జూన్ 29 నుండి ఆగస్టు 28 వరకు అభ్యర్థులు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్లైన్ దరఖాస్తు చేసిన తరువాత అవసరమైన డాక్యుమెంట్లతో పాటు దరఖాస్తును సంబంధిత ఏ వన్ సెంటర్ లేదా ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో సమర్పించాలి. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. ప్రశాంత్ రెడ్డి సూచించారు. పూర్తి వివరాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ రామడుగు రవీందర్‌ను 9440415099 నంబరులో సంప్రదించవచ్చు.

## తండాల అభివృద్ధి, రైతు సంక్షేమానికై సంక్షేమానికై ప్రభుత్వం కట్టుబడి ఉంది

- మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం దుబ్బతండా గ్రామపంచాయతీ పరిధిలోని రాజులతండాలో రూ.2.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రహదారి పనులకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. తండాల అభివృద్ధికి రహదారి సౌకర్యాలు కీలకమని, పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన మంత్రి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా అధికారులు పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. దుబ్బతండాకు చెందిన మాజీ జవాన్ గుగులోత్ నరసింహ నాయక్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మీర్జాపూర్ రైతు వేదికలో మంత్రి పొన్నం రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందించి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. తండాల అభివృద్ధి, రైతు సంక్షేమం, మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు.

# పేద గర్భిణీలకు ఉచిత ప్రసూతి సేవలు



**పెద్దపల్లి, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆర్థిక ఇబ్బందులతో నాణ్యమైన వైద్యానికి దూరమవుతున్న గర్భిణీ స్త్రీలకు విశ్వహిత సేవా ట్రస్ట్ ఆశాదీపంగా మారింది. విశ్వహిందూ పరిషత్ సారధ్యంలో, ప్రియాంక మెటర్నిటీ క్లినిక్ సహకారంతో పేద గర్భిణీలకు పూర్తిగా ఉచిత ప్రసూతి సేవలు అందించేందుకు ఈ సంస్థ ముందుకు వచ్చింది. ఈ సేవలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్‌ను గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, నేటి కాలంలో ప్రసూతి వైద్యం భారంగా మారుతున్న తరుణంలో పేదలకు ఉచిత సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ స్వరూప్ కిరణ్ గౌడ్ మాట్లాడుతూ, ఆసుపత్రిలో ఆధునిక వైద్య సదుపాయాలతో ప్రసూతి సేవలు మాత్రమే కాకుండా శిశువుల ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. ఈ సేవలను వినియోగించుకోవాలనుకునే గర్భిణీ స్త్రీలు వివరాల కోసం 9492202108 నంబరులో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు, ట్రస్ట్ ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధి పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



**పెద్దపల్లి, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి పట్టణంలోని 12వ వార్డు సాగర్ రోడ్‌లో రూ. 1.55 కోట్ల యుఐడిఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజి నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, వార్డు కౌన్సిలర్ దొడ్డుపల్లి జగదీష్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సహకారంతో పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజి, అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ పనులను పూర్తి చేసి పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం 12వ వార్డులోని మంచినీటి బావి, శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ పాగల శ్రీకాంత్, మున్సిపల్ ఎంఏఈ సతీష్, నాయకులు దొడ్డుపల్లి శేఖర్, దేవనంది దేవరాజ్, వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, సానిటరీ ఇన్స్పెక్టర్ పులిపాక రాజు, వైద్య సిబ్బంది డాక్టర్ మమత, ఏఎన్‌ఎం నిర్మల, ఆశ వర్కర్ మమత, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# జూలై 2న ఉద్యమకారుల కోసం భూ పోరాటం

- సలేంద్ర కొమురయ్య యాదవ్



**పెద్దపల్లి, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం జూలై 2న ఉప్పల్ బగాయత్‌లో టీఆర్ఎస్ ఆధ్వర్యంలో భూ పోరాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు పెద్దపల్లి జిల్లా బాధ్యులు సలేంద్ర కొమురయ్య యాదవ్ తెలిపారు. పెద్దకల్వల గ్రామంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలు కోసం చలో ఉప్పల్ బగాయత్ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం, నెలకు రూ. 25 వేల పెన్షన్, గుర్తింపు కార్డులు, సంక్షేమ పథకాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ పోరాటం జరుగుతుందని వివరించారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపిస్తూ, ఉద్యమకారులందరూ పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బొంగోని శంకరయ్య గౌడ్, మల్యాల కరుణాకర్, బొంకూరి సుభాష్, దేవనంది లక్ష్మయ్య, సీహెచ్ హనుమాన్లు, కల్వల రవీందర్, గంధం శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# తహసిల్దార్ భవనాలకు నిధులు మంజూరు

**ఖానాపూర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ నియోజకవర్గంలోని కడెం, ఖానాపూర్, ఉట్నూర్ మండలాల్లో తహసిల్దార్ కార్యాలయాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వేడుమ బొజ్జు పటేల్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధి జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. గత ఇరువై ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న తహసిల్దార్ కార్యాలయాల్లో అధికారులు విధులు నిర్వహిస్తున్నారని, త్వరలో కొత్త భవనాల నిర్మాణం ప్రారంభమవుతుందని తెలిపారు. ఎమ్మెల్యే కృషి పట్ల ప్రజలు అభినందనలు తెలిపారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**మర్రిగూడ, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్పుల యాదయ్య మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు కాకుండా నేరుగా కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. సహజ మరణ పరిహారాన్ని రూ. 5 లక్షలకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సల్వోజు రామలింగాచారి, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

# గుండాలలో శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

- పాల్గొన్న టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి



**వెల్దండ, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండలంలోని గుండాల గ్రామంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మరియు టాస్క్ సి.ఓ.ఓ. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “ఆలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాదు, సమాజంలో సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలు, ఆధ్యాత్మికత, ఐక్యతను పరిరక్షించే పవిత్ర కేంద్రాలు. గ్రామాల్లో ఆలయాలు అభివృద్ధి చెందితే ప్రజల్లో భక్తి భావంతో పాటు పరస్పర సహకారం, సామాజిక బాధ్యత పెరుగుతుంది” అని అన్నారు. ఆలయ అభివృద్ధి కోసం తన వంతు సహకారంగా రూ. 2,00,000 విరాళం అందజేశానని, భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే ప్రతి మంచి కార్యక్రమానికి, ఆలయాల అభివృద్ధికి సహకారం కొనసాగిస్తానని రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, గ్రామ ప్రజల విజ్ఞప్తికి వెంటనే స్పందించి పెద్ద మొత్తంలో సహకారం అందించినందుకు ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ఆయన ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శిరీష వెంకటయ్య, ఉప సర్పంచ్ కొమ్ము లింగం, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, సీనియర్ నాయకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రెండు రోజుల్లో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలి

-- కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్‌కర్నూల్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలోని ప్రతి అర్హ ఓటరికి బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను రానున్న రెండు రోజుల్లో తప్పనిసరిగా పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఫారాలను పంపిణీ చేయడమే కాకుండా, వాటిని సక్రమంగా పూరించి నిర్ణీత గడువులోగా తిరిగి స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్లకు ఫారం నింపే విధానం, అవసరమైన పత్రాలపై పూర్తి అవగాహన కల్పించాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే నివృత్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి బీఎల్‌ఓ రోజువారీ పురోగతిని తహసీల్దార్లు పర్యవేక్షించి, డేటా నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో 7,31,632 మంది ఓటర్లలో ఇప్పటివరకు 4,82,116 మందికి ఫారాలు పంపిణీ చేయగా, ఇది 65.9 శాతం పూర్తయిందని, రానున్న రెండు రోజుల్లో 100% పంపిణీ పూర్తి చేసి డేటాను ఆన్లైన్లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్, డిఆర్‌ఓ పాండు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఓవర్సీస్ స్కాలర్షిప్స్ దరఖాస్తు తేదీలు పొడిగింపు

**కరీంనగర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్షిప్స్ స్ప్రింగ్ సీజన్ 2026 దరఖాస్తు తేదీలను ప్రభుత్వం పొడిగించింది. జూలై 1 నుండి జూలై 15 వరకు సాయంత్రం 5 గంటల వరకు ఈపాస్ పోర్టల్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. అమెరికా, యుకె, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, సౌత్ కొరియాలో పీజీ, పీహెచ్‌డీ చదవాలనుకునే విద్యార్థులు అర్హులు. జనవరి 1 నుండి జూన్ 30, 2026 మధ్యకాలంలో విదేశీ విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉపకార వేతనం రూ. 20 లక్షలు, టికెట్ ఖర్చు గరిష్టంగా రూ. 60,000 వరకు అందించబడుతుంది. ఆదాయ పరిమితి రూ. 5 లక్షలు మించరాదు. దరఖాస్తు చేసిన తరువాత అవసరమైన పత్రాలను జూలై 31లోపు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయం, కలెక్టరేట్ భవనంలో సమర్పించాలి. వివరాలకు 08782957085నంబరులో సంప్రదించవచ్చు.

# తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ సమక్షంలో రాజేశుని శ్రీనివాస్ కు ఘన సన్మానం



**కరీంనగర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎస్‌బీ) హోదాలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందుతున్న రాజేశుని శ్రీనివాస్, సుమలత దంపతులకు తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడుతూ, వివాహ వార్షికోత్సవం సందర్భంగా కూడా శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక చైర్మన్ వూట్కూరి శ్రీనివాస్ రెడ్డి, ట్రస్టు సభ్యులు గాజుల శ్రీనివాస్, పాక శ్రీనివాస్, ఒటారికారి శ్రీనివాస్, సూర శ్రీనివాస్, శ్రీరాముల శ్రీనివాస్, గాంధారి శ్రీనివాస్, కటకం శ్రీనివాస్, బలుగూరి శ్రీనివాస్, గౌతమ్ విశిష్ట, మిర్యాల అమ్మాదాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై ఆర్డీఓ పరిశీలన



**అమ్రాబాద్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అచ్చంపేట పట్టణంలోని 9వ వార్డులో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ఆర్డీఓ యాదగిరి పరిశీలించారు. వార్డు అధ్యక్షుడు పెరుముల రాజేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఆయన ప్రజలకు గణన పత్రాలు ఎలా నింపాలో వివరించారు. ప్రతి అర్హుడైన ఓటరు తమ వివరాలను సరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ బీశ్వ, రెవెన్యూ పరిశీలకులు శివకుమార్, ఓటర్ల నమోదు అధికారిణి హైమావతి, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటర్ మ్యాపింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అమ్రాబాద్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం ఎల్మపల్లి గ్రామంలో జరుగుతున్న ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. బీఎల్‌ఏ సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆయన ఓటరు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం అత్యంత కీలకమని, ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందేలా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ మ్యాపింగ్‌ను పకడ్బందీగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమ్రాబాద్ సర్పంచ్ చిగురుల కోటయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, ఎన్నికల అధికారులు, బీఎల్‌ఏ సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

-- డా. చింతపల్లి శ్రీనివాస్ గౌడ్



**దేవరకొండ, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు నిర్వహించిన మహాధర్నాలో రాష్ట్ర కార్యదర్శి డా. చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న 10,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని, ప్రభుత్వం వివక్షత, మొండివైఖరి ప్రదర్శిస్తోందని ఆయన విమర్శించారు. జీవో నెంబర్ 8, 9లను రద్దు చేసి పాత విధానంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. డిమాండ్లు నెరవేరకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి పేద విద్యార్థులకు కావలసిన బకాయిలను సాధించుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, భీమగోని శివ గౌడ్, మునగాల గణేష్, దోమకొండ హరి, లౌడియా బాషా నాయక్, వసుకుల కృష్ణ యాదవ్, బొమ్మ శ్రీనివాస్ యాదవ్, జెల్లా వెంకట గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌కు ఘన సన్మానం



**ఎలిగేడు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలం రాములపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విశిష్ట సేవలందించిన కట్కూరి చంద్రశేఖర్ను గ్రామ ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్, గ్రామ కార్యదర్శి ఆర్. హరిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీవాణి ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి ఆయనకు గౌరవం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, చంద్రశేఖర్ విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు క్రమశిక్షణ, సమాజం పట్ల ఉన్నత భావాలు అలవర్చడంలో విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన సేవలు రాములపల్లి ప్రజలు, విద్యార్థులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నారాయణపల్లిలో పౌర హక్కుల దినోత్సవ గ్రామసభ



**ఎలిగేడు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఎలిగేడు మండలం నారాయణపల్లి గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ యాకయ్య మాట్లాడుతూ, అందరూ స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న కుల వివక్షత, అంటరానితనం రూపుమాపడానికి, అలాగే వారిపై జరుగుతున్న అత్యాచారాలపై అవగాహన కల్పించడానికి ప్రతి నెల ఒక గ్రామంలో ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామసభలో ఎంపీడీవో భాస్కర్ రావు, సర్పంచ్ రంగు లత–శ్రీనివాస్, ఉపసర్పంచ్ కోతిరెడ్డి బాపురెడ్డి, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి, విపిఒ, వార్డు సభ్యులు, ఏఎన్ఎం, అంగన్వాడీ మేడం, ఆశా వర్కర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నర్సాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటేష్ గౌడ్

**ఎలిగేడు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని నర్సాపూర్ గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ పల్లెర్ల వెంకటేశ్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరి సహకారం అవసరమని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవి, కార్యదర్శి లలిత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ ప్రధాన రహదారుల పనులు నెల రోజుల్లో పూర్తి



**బోడుప్పల్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బోడుప్పల్--చెంగిచెర్ల, బోడుప్పల్ (అంబేద్కర్ విగ్రహం)--చిల్కానగర్ ప్రధాన రహదారుల అభివృద్ధి పనులు మరో నెల రోజుల్లో పూర్తవుతాయని మాజీ మేయర్ తోటకూర అజయ్ కుమార్ యాదవ్ తెలిపారు. రూ. 26 కోట్ల వ్యయంతో హెచ్ఎండీఏ చేపట్టిన ఈ పనులకు ప్రధాన అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాల మార్పిడి ప్రక్రియ పూర్తికావడంతో పనులు వేగంగా కొనసాగనున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ, హెచ్ఎండీఏ ఈఈ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ వింగ్ ఈఈ నవీన్ రావు, టీఎస్ఎస్పీడీసీఎల్ డీఈ బాగయ్య, ఏఈ కిరణ్మయి, కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి రహదారి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ రెండు ప్రధాన రహదారులు త్వరలో పూర్తవడం సంతోషకరమని, పనులను నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో అధికారులు, మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

- చెక్కల లక్ష్మణ్



**ఆమనగల్లు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ఉదయ్ నగర్ కాలనీలో బూత్ నంబర్–187 పరిధిలో మంగళవారం ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ బీఎల్వోలు, బీఎల్ఏలకు సర్వే పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చెక్కల లక్ష్మణ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ సర్వే ప్రధాన లక్ష్యమన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదు కాని అర్హులు వెంటనే నమోదు చేసుకోవాలని, అలాగే పేరు, చిరునామా తదితర వివరాల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులు అవసరమైతే సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి ఓటరు తమ వివరాలను తప్పనిసరిగా పరిశీలించి, ఏవైనా పొరపాట్లు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సర్వేలో భాగంగా బీఎల్వోలు, బీఎల్ఏలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి కొత్తగా అర్హత పొందిన వారి వివరాలను నమోదు చేయడంతో పాటు అవసరమైన మార్పులు, చేర్పులపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు, బీఎల్ఏలు చెక్కల సాయి, స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో ప్రతీ ఒక్క అర్హుడూ ఉండాలి

- గుండ్రాతి కుమార్ గౌడ్



**ఆమనగల్లు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఓటరు జాబితాలో అర్హులైన ప్రతీ ఓటర్ ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర నాయకులు గుండ్రాతి కుమార్ గౌడ్ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ఉదయ్‌నగర్ కాలనీలో మంగళవారం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి భారత పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు అత్యంత విలువైనదని అన్నారు. బీఎల్‌వోలు తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తూ ఓటర్ల పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. జూలై 24 వరకు కొనసాగే ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజలు చురుకుగా పాల్గొని తమ వివరాలను పరిశీలించుకోవాలని, జూలై 30న విడుదలయ్యే ముసాయిదా ఓటరు జాబితాలో ఎలాంటి లోపాలు లేకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తున్నందున ప్రజలందరూ పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వో సాయిరాం, బీఎల్‌ఏలు గుండ్రాతి కుమార్ గౌడ్, ఎండి గౌస్, గుదేటి శివ, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# హాట్యా తండాలో పశువైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మిర్యాలగూడ మండలంలోని హాట్యా తండా గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో, జాతీయ మాంస పశు పరిశోధనా సంస్థ సహకారంతో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "రాష్ట్ర ప్రభుత్వం రైతులు, పశుపాలకుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. పాడి పశువుల ఆరోగ్యం మెరుగుపడితే రైతుల ఆర్థిక స్థితి బలోపేతం అవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడమే ఈ శిబిరాల లక్ష్యం" అని పేర్కొన్నారు. శిబిరంలో పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు, టీకాలు, మందులు ఉచితంగా అందించారు. అదేవిధంగా పశుపోషణ, వ్యాధి నివారణ, శాస్త్రీయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, పశుసంవర్ధక శాఖ అధికారులు, జాతీయ మాంస పశు పరిశోధనా సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా పద్మ యాదవ్




**నాగర్‌కర్నూల్, జూన్ 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా నియమితులైన పద్మ విజయ్‌కుమార్ యాదవ్ పార్టీని, మహిళా మోర్చాను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. నాయకత్వం తనను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఆమె, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం మోసమని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీని మహిళలే గట్టిగా ఎదుర్కొంటారని అన్నారు. జిల్లాలో పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ భవిష్యత్తులో పోరాటాలు నిర్వహిస్తానని, మూడు శాసనసభ, పార్లమెంటు స్థానాల్లో బీజేపీ విజయం సాధించి రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏర్పడేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మహిళా మోర్చా సబ్బండ వర్గాల సంక్షేమానికి నిరంతరం పనిచేస్తుందని, విద్యార్థుల బకాయిలు చెల్లించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించేందుకు ఉద్యోగాలను భర్తీ చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# ఏఐటీయూసీ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి




**దేవరకొండ, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
డిండి మండలంలో జరిగిన ఏఐటీయూసీ మండల కార్యవర్గ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జూలై 19న గుర్రంపోడులో జరగనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో 1920లో ఆవిర్భవించిన ఏఐటీయూసీ స్వాతంత్ర్యానికి ముందే కార్మికుల కోసం అనేక చట్టాలను సాధించిందని, కానీ నేటి పరిస్థితుల్లో కార్మికులు కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ వంటి హక్కులను కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అవుట్సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు, అంగన్వాడి, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లు, గ్రామపంచాయతీ కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, కార్మికులకు నష్టం కలిగించే విధంగా మార్పులు చేస్తోందని ఆయన విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. జిల్లా మహాసభల్లో కార్మికుల సమస్యలను బహిర్గతం చేసి, పోరాటాల ద్వారా హక్కులను సాధించేందుకు ఏఐటీయూసీ కృషి చేస్తుందని వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.

# రైతు భరోసా విడుదల ప్రత్యక్ష ప్రసారం



**ఎలిగేడు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వానకాలం పంటలకు రైతు భరోసా నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేసిన కార్యక్రమాన్ని మంగళవారం ఎలిగేడు మండలంలోని సుల్తాన్పూర్, ధూళికట్ట రైతు వేదికలలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులు వీక్షించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చూపించారు. ఈ సందర్భంగా ఏవో ఉమాపతి, సర్పంచులు కొమురయ్య, బాపయ్య, ఏఈవోలు శరణ్య, సురేశ్, గణేశ్ పాల్గొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై భరోసా నిధుల విడుదలను ఆనందంగా వీక్షించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

-వంశీ చందర్ రెడ్డి



**ఆమనగల్లు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీ చందర్ రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వంశీ చందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులందరికీ చేరేలా కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ నాయకులు ఎల్లప్పుడూ ముందుండాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై నాయకులతో ఆయన సుదీర్ఘంగా చర్చించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండేలా నాయకులు పనిచేయాలని సూచించారు. అనంతరం నాయకులు వంశీ చందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసి, పార్టీ అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వ అండ

- సీఎం సహాయ నిధి చెక్కులు, ఎల్ఓసీ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**ఆమనగల్లు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు గౌరవ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, ఎల్ఓసీ పత్రాలను మండల ముఖ్య నాయకుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఊరటనిస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, వగ్గు మహేష్ మరియు నాయకులు, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## చట్టాల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం

- జడ్జి ముదిగొండ రాజు




**కల్వకుర్తి, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ముదిగొండ రాజు మాట్లాడుతూ, "చట్టాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి. యువతీ, యువకులు రాజ్యాంగాన్ని చదవాలి" అని సూచించారు.వెల్దండ మండలంలోని రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పిల్లలకు ఫోన్ ఎక్కువగా ఇవ్వడం వల్ల కంటి సమస్యలు వస్తాయని, ప్రజలు సైబర్ మోసాలకు గురవుతున్నారని హెచ్చరించారు. అనధికార కాల్స్, వీడియో కాల్స్‌కి స్పందించవద్దని సూచించారు.18 ఏళ్ల లోపు పిల్లలకు ఇబ్బందులు కలిగిస్తే పాక్సో కేసులు నమోదు చేస్తామని, పిల్లలను పనిలో పెట్టకుండా పాఠశాలకు పంపాలని ఆయన స్పష్టం చేశారు. సివిల్ కేసుల్లో పోలీసులు జోక్యం చేసుకోరాదని, మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.సీనియర్ న్యాయవాది సి. కృష్ణయ్య మాట్లాడుతూ, భూ పంచాయతీలు ఉంటే సివిల్ కోర్టులో దావా వేయవచ్చని, రూ.100 దాటి స్థిరాస్తి కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు.కార్యక్రమంలో సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. మల్లేష్, సీఐ రఘువీర్ రెడ్డి, ఎస్సై యుగేందర్ రెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలే లక్ష్యంగా సేవలు

- సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**ఆమనగల్లు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ (గూగుల్) సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. తలకొండపల్లి పట్టణ కేంద్రంలో మంగళవారం 70 రోజులుగా నిర్వహించిన ఉచిత పోలీస్ ఎస్ఐ, కానిస్టేబుల్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్న అభ్యర్థులను అభినందించిన ఆయన, రాబోయే పోలీస్ నియామక పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, ప్రణాళికాబద్ధమైన చదువు, శారీరక దృఢత్వం, సమయపాలన విజయానికి కీలకమని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగం కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశమని పేర్కొన్నారు. అపజయాలను చూసి నిరాశ చెందకుండా ప్రతి అవకాశాన్ని విజయానికి మెట్టుగా మార్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కూడా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో "స్కిల్ ఫ్యాక్టరీ" ద్వారా ఏఐ, ఐటీ, భాషా నైపుణ్యాలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి కల్వకుర్తి నియోజకవర్గ యువతకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. "ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగి" అనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. శిక్షణ పొందిన అభ్యర్థులు మాట్లాడుతూ ఉచితంగా నాణ్యమైన శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్ అందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిక్షణ తమ ప్రభుత్వ ఉద్యోగ లక్ష్య సాధనకు ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు విశ్వనాథ్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు యాదయ్య, విజయ్ కుమార్, శిక్షణ పొందిన అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# 'కపాస్ కాంతి' మిషన్‌తో పత్తి సాగులో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఆమనగల్లు, మాడుగులలో 742 ఎకరాల్లో అమలు..
- రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే




**ఆమనగల్లు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో వానాకాలం--2026లో అమలు చేస్తున్న 'పత్తి ఉత్పాదకత పెంపు (కపాస్ కాంతి) మిషన్' పథకం ద్వారా ఆమనగల్లు, మాడుగుల మండలాల్లో 742 ఎకరాల్లో పత్తి సాగును లక్ష్యంగా నిర్ణయించినట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ఈ పథకం కింద ఎంపికైన రైతులకు రాశి, ప్రవర్ధన్ కంపెనీల సబ్సిడీ పత్తి విత్తనాలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పత్తి సాగులో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, రైతుల దిగుబడులు, ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ పథకంలో భాగంగా రైతులకు అధిక సాంద్రత పత్తి సాగు, దగ్గర దగ్గరగా నాటే విధానం, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి క్షేత్రస్థాయిలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ విధానాలను అనుసరించడం వల్ల సాగు వ్యయం తగ్గి అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. రైతులకు సబ్సిడీ పత్తి విత్తనాలతో పాటు సేంద్రియ సస్యరక్షణ మందులు, సాంకేతిక మార్గదర్శకాలు కూడా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మాడుగుల మండలం రాందుగ్గెల గ్రామానికి చెందిన రైతు ఈదుల కృష్ణయ్య పొలంలో న్యుమాటిక్ ప్లాంటర్ ద్వారా సబ్సిడీ పత్తి విత్తనాల విత్తన ప్రక్రియను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహా, సహాయ వ్యవసాయ సంచాలకులు శోభారాణి, వ్యవసాయ అధికారులు అరుణకుమారి, శ్రీనివాస్ గౌడ్, ఏఈఓలు రాజేష్, ప్రియాంక, భార్గవి, జ్యోత్స్న, గురుప్రసాద్, సుజాత, ప్రభావతి, నికితా, మాడుగుల సర్పంచ్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

## ఉర్కొండలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు ముందస్తు ఏర్పాట్లు



**కల్వకుర్తి, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూలైలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉర్కొండ మండలంలోని ప్రసిద్ధ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు.ఆలయ పరిసరాలు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, భక్తుల రాకపోకలు, వాహనాల పార్కింగ్, భద్రతా చర్యలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం ఉర్కొండపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానాన్ని సందర్శించి, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. హెలికాప్టర్ ల్యాండింగ్, కాన్వాయ్ రాకపోకలు, అత్యవసర సేవల ఏర్పాట్లపై సమగ్ర సూచనలు చేశారు.మండలంలో ప్రతిపాదించిన ఇంటిగ్రేటెడ్ మండల స్థాయి కార్యాలయాలు, నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణ స్థలాలను కూడా పరిశీలించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా మౌలిక వసతులతో ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.ఉర్కొండ రైతు వేదికలో జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి పర్యటన జిల్లాకు ప్రతిష్ఠాత్మకమైనది. ప్రతి శాఖ అధికారి పూర్తి బాధ్యతతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలి" అని అన్నారు. పరిశుభ్రత, పచ్చదనం, తాగునీటి వసతులు, ఆరోగ్య రక్షణ, వ్యవసాయ అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.జిల్లా ఎస్పీ పోలీసు అధికారులకు భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక సూచనలు చేశారు.కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ దేవ సహాయం, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో జనార్దన్ రెడ్డి, తహసీల్దార్ యూసుఫ్ అలీ, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

- ప్రభుత్వ పాఠశాలలకు మెరుగైన వసతులు కల్పించాలని సీపీఎం డిమాండ్



**ఆమనగల్లు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆమనగల్ పట్టణంలోని భవాని గార్డెన్‌లో తలకొండపల్లి, ఆమనగల్, మాడుగుల, కడ్తాల్ మండలాల ముఖ్య నాయకుల సమావేశం కామ్రేడ్ పి.శివశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కందుకూరు జగన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడి మౌలిక వసతులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, క్రీడా సామగ్రి, నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను మెరుగుపరచాలని, పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని, పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కానుగుల వెంకటయ్య, గుమ్మడి కురుమయ్య, శివగల్ల రమేష్, గోరేటి నరసింహ, గంజి యాదగిరి, పల్లేటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఆకుతోటపల్లి పాఠశాలల అభివృద్ధికి డీఈవో హామీ

- సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేసిన సర్పంచ్ నరేందర్ రెడ్డి



**ఆమనగల్లు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం గ్రామ సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ ప్రాథమిక పాఠశాలను ప్రీ ప్రైమరీ విద్య అమలుకు ఎంపిక చేయాలని, డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులను తిరిగి విధుల్లోకి పంపించాలని, ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం (బయాలజీ) ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. వినతిపై స్పందించిన జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పాండు, ఉప సర్పంచ్ ఓర్సు శ్రీను, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, వార్డు సభ్యులు వనం విజయ్ కుమార్, షేక్ సాజిద్, విద్యార్థుల తల్లిదండ్రుల ప్రతినిధి కామాజి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సాలార్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

- పాఠశాలను సందర్శించిన ఎన్ఎస్‌యూఐ నాయకుడు పవన్ కళ్యాణ్



**ఆమనగల్లు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కడ్తాల్ మండలం సాలార్‌పూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలను ఎన్ఎస్‌యూఐ నాయకుడు పవన్ కళ్యాణ్ మంగళవారం సందర్శించి అక్కడి సమస్యలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలో వాష్‌రూమ్‌లు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థుల సంఖ్య పెరగడంతో తగిన తరగతి గదులు లేక బోధనకు ఆటంకం ఏర్పడుతోందని తెలుసుకున్నారు. ఈ సమస్యలను వెంటనే ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజాప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో కర్రెమంది రాజు, కొప్పు మహేందర్, కె. దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ విజయవంతానికి పట్టణ ప్రజల సహకారం అవసరం

-కమిషనర్ మహమూద్ షేక్



**కల్వకుర్తి, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ పట్టణ ప్రజలకు సూచించారు. జూన్ 25 నుండి ప్రారంభమైన ఈ ప్రక్రియ జూలై 24 వరకు కొనసాగుతుందని, ప్రతి ఇంటికి బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తారని తెలిపారు. ప్రజలు ఫారాలను సక్రమంగా నింపి తిరిగి బీఎల్ఓలకు అందజేయాలని ఆయన కోరారు. పట్టణంలోని రాజకీయ పార్టీలు, బీఎల్ఏలు, స్వచ్ఛంద సంస్థలు అందరూ సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో బీఎల్ఓ సూపర్వైజర్, అధికారులు పాల్గొన్నారు.

## నేడు కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం



**కల్వకుర్తి, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ వైద్యుల దినోత్సవం (జూలై 1) సందర్భంగా కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రక్తదానం మహాదానం. కల్వకుర్తి పట్టణంలో మూడు జాతీయ రహదారులు ఉండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చు" అని అన్నారు. నాగర్‌కర్నూల్ బ్లడ్ బ్యాంక్‌కు రక్తాన్ని అందజేస్తున్నామని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల, కౌన్సిలర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొననున్నారు.

# తల్లిదండ్రులదే బాధ్యత

- ఎస్సై చంద్రశేఖర్



**నందికొట్కూరు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పిల్లల నిండు జీవితానికి మొదటి అడుగు తల్లిదండ్రుల వద్ద నుంచే ప్రారంభమవుతుందని, వారి భవిష్యత్తు క్రమశిక్షణతో తీర్చిదిద్దడం తల్లిదండ్రుల బాధ్యత అని టౌన్ ఎస్సై చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం పట్టణంలో వాహనాల విస్తృత తనిఖీల సందర్భంగా మైనర్ బాలుడు ద్విచక్ర వాహనం నడపడం గమనించి, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, "మీ చిన్నారుల జీవితంపై నిర్లక్ష్యం చేయకండి. వాహనాలు నడపడం, చెడు అలవాట్లకు దగ్గర కావడం వంటి విషయాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలి" అని హెచ్చరించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు -- పన్ను రసీదు, ఫిట్‌నెస్ సర్టిఫికేట్, భీమా పత్రాలు, కాలుష్య ధృవీకరణ, అనుమతిపత్రాలు -- తప్పనిసరిగా వాహనం వెంట ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## బ్రాహ్మణకోట్కూరులో 'శక్తి యాప్'పై విస్తృత అవగాహన




**నందికొట్కూరు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నంద్యాల జిల్లా వ్యాప్తంగా మహిళల భద్రత, చిన్నారుల సంరక్షణ, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రస్తుత చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆత్మకూరు డీఎస్పీ రామంజి నాయక్, నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం సూచనలతో బ్రాహ్మణకోట్కూరు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఎస్ఐ మణికంఠ పోలీస్ సిబ్బందితో కలిసి బ్రాహ్మణకోట్కూరులోని విజ్డమ్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులకు మహిళల రక్షణ, బాలల సంరక్షణ, సైబర్ భద్రత అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ వినియోగం, హెల్ప్‌లైన్ నంబర్ 7993485111 గురించి వివరించారు. పాల్గొన్న వారందరూ తమ మొబైల్ ఫోన్లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై మణికంఠ మాట్లాడుతూ బాల్య వివాహాల దుష్పరిణామాలు, వాటివల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. పిల్లలపై జరిగే నేరాలకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు అందించాలని సూచించారు. మహిళల రక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలు, అత్యవసర పరిస్థితుల్లో 112 మరియు 100 సేవలను వినియోగించుకోవాలని వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులు, మోసపూరిత సందేశాలను తెరవవద్దని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలకు వైద్య, న్యాయ, మానసిక సహాయం అందించే వన్ స్టాప్ సెంటర్ సేవల గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొని మహిళల భద్రత, బాలల సంరక్షణ, సైబర్ భద్రతపై అవగాహన పొందారు.

## 98 జీవో బాధితులకు ఉద్యోగాలు కల్పించాలి



**నందికొట్కూరు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరు పట్టణంలో 97 రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్న నీటి ముంపు బాధితులకు రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్స్ ఫెడరేషన్ మంగళవారం మద్దతు తెలిపింది. జిల్లా అధ్యక్షుడు బి. శేఖర్ నాయుడు మాట్లాడుతూ, "శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం పూర్తై దశాబ్దాలు గడిచినా జీవో నెంబర్ 98లో పేర్కొన్న హామీలు అమలు కాలేదు. ఇప్పటికీ 674 మంది బాధితులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు న్యాయంగా రావలసిన ఉద్యోగాలను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యస్. రమేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## జీవో-12 ను వెంటనే రద్దు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు



**కల్వకుర్తి, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమ బోర్డు పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో-12ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం కల్వకుర్తి మండల తహసీల్దార్ ఇబ్రహీంకు వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ, సహజ మరణ పరిహారాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని, ఇల్లు లేని నిరుపేద కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, 50 ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు రూ.6,000 పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, కమిటీ కోశాధికారి యాదయ్య, నాయకులు రాజు గౌడ్, ప్రభాకర్ రెడ్డి, జంగయ్య, వెంకటయ్య, సుదర్శన్ రెడ్డి, పడకంటి రాజు, సాగర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల బస్సులను తనిఖీ చేయాలని డిమాండ్

- బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్



**కల్వకుర్తి, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రైవేట్ పాఠశాలలు సామర్థ్యం లేని బస్సులతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని తీవ్రంగా ఖండిస్తూ, వెంటనే తనిఖీలు జరిపి చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎంవిఐ అధికారి సాయి కృష్ణకు వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ, అనేక పాఠశాలలు సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించుకొని బస్సులు నడుపుతున్నాయని, డ్రైవర్లు రవాణా నియమాలు పాటించకపోవడం, ఫోన్ మాట్లాడుతూ అతివేగంగా నడపడం ప్రమాదాలకు దారితీస్తోందని పేర్కొన్నారు. బస్సుల్లో విద్యార్థుల లిస్టు లేకపోవడం, ప్రథమ చికిత్స కిట్ లేకపోవడం, అటెండర్ లేకపోవడం, కిటికీలకు సేఫ్టీ లేకపోవడం వంటి నిర్లక్ష్యాలు విద్యార్థుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రవాణా శాఖ అధికారులు ప్రతి బస్సును తనిఖీ చేసి, సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్న పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, గుర్తింపును రద్దు చేయాలని గణేష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు బలగం కేశవులు, విజయ్ కుమార్, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా శ్రీ మహాలక్ష్మి గీతా పారాయణం

- పాపిశెట్టి శ్వేత--రాము నివాసంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు



**ఆమనగల్లు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు పట్టణంలో ప్రతి పౌర్ణమి సందర్భంగా నిర్వహించే శ్రీ మహాలక్ష్మి గీతా పారాయణ కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. శ్రీ రామదూత ఆశ్రమం వ్యవస్థాపకులు సద్గురు శ్రీ నిత్య శ్రద్ధానంద స్వామి ఆధ్వర్యంలో ప్రముఖ సంఘసేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి శ్వేత--రాము, కళ్యాణి--అరవింద్ దంపతుల నివాసంలో ప్రత్యేక పూజలు, శ్రీ మహాలక్ష్మి గీతా పారాయణం, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సద్గురు శ్రీ నిత్య శ్రద్ధానంద స్వామి మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి రోజున గీతా పారాయణం, దైవారాధన చేయడం వల్ల కుటుంబాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం చేకూరుతాయని తెలిపారు. భగవద్గీత బోధించిన ధర్మమార్గాన్ని ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని, ఆధ్యాత్మిక చింతనతో సమాజంలో నైతిక విలువలు పెంపొందుతాయని పేర్కొన్నారు. అనంతరం భక్తులు శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందగా, పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, యాదయ్య, అర్థం లక్ష్మయ్య, పాపిశెట్టి కుమారస్వామి, కౌసల్యతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## ఓటర్ నమోదు పారదర్శకతపై సమీక్ష

**- ఎమ్మెల్యే గిత్త జయసూర్య**



**నందికొట్కూరు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మిడ్తూరు మండల కేంద్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య బూత్ లెవెల్ ఏజెంట్లతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాల ప్రక్షాళన, అర్హులైన ఓటర్ల నమోదు, నకిలీ ఓటర్ల తొలగింపు వంటి అంశాల్లో పారదర్శకత తప్పనిసరి అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటరు పాత్ర కీలకమని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, శివరామి రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సర్వోత్తం రెడ్డి, సుధాకర్ రెడ్డి, బూత్ లెవెల్ ఏజెంట్లు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ బాధితులకు తక్షణ న్యాయం

**- అడిషనల్ ఎస్పీ ఖాదర్ భాష**



**నందికొట్కూరు, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎస్సీ, ఎస్టీ బాధితులకు తక్షణ న్యాయం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని జిల్లా అడిషనల్ ఎస్పీ ఖాదర్ భాష స్పష్టం చేశారు.మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "బాధితుల పట్ల అధికార యంత్రాంగం సున్నితంగా వ్యవహరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణ స్పందనతో చట్టపరమైన చర్యలు తీసుకోవాలి" అని సూచించారు.ఏప్రిల్ 2022 నుంచి ఫిబ్రవరి 2026 వరకు 387 కేసుల్లో నిందితులపై ఎఫ్ఐఆర్లు నమోదు చేసి, 682 బాధితులకు రూ. 9.2 కోట్ల పరిహారం అందించామని తెలిపారు. అలాగే మార్చి 2026 నుంచి జూన్ 2026 వరకు నమోదైన 13 కేసుల్లో 24 బాధితులకు రూ. 34.75 లక్షలు ఆర్థిక సాయం పంపిణీ చేసినట్లు వివరించారు.సఫాయి కర్మచారుల సమస్యలపై స్పందిస్తూ, వారికి వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కమిటీ సభ్యులు సూచించారని తెలిపారు. అలాగే కర్మచారుల సంక్షేమ స్కీముల కోసం బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు.

## తొలకరి వర్షాలతో రైతుల్లో ఉత్సాహం



**ఖానాపూర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వేసవి తీవ్ర తాపం తర్వాత గత రెండు రోజులుగా కురిసిన వర్షాలతో రైతుల్లో ఆనందం నెలకొంది. భూమి తడవడంతో రైతులు నాగళ్ళు, ట్రాక్టర్లతో పొలాలను చదును చేస్తూ, గడ్డి చెత్త, కలుపు మొక్కలు తొలగించడంలో నిమగ్నమయ్యారు.ఖానాపూర్ మండలంలో దాదాపు 19 వేల ఎకరాల్లో రైతులు సేద్యం చేయడానికి సిద్ధమవుతున్నారు. పెసర, మొక్కజొన్న, బొబ్బెర, పసుపు, మిర్చి, సోయాబీన్, పత్తి వంటి ఖరీఫ్ విత్తనాలను వేసేందుకు రైతులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. పొలాల్లో రైతులు, కూలీలు కలసి విత్తనాలు వేసే పనిలో నిమగ్నమవడంతో గ్రామాలు కళకళలాడుతున్నాయి.దిల్వర్పూర్ రైతులు రాసముల్ల భూమేష్, పెండం నరసయ్య మాట్లాడుతూ సకాలంలో విత్తనాలు నాటితే పంట తొందరగా చేతికొస్తుందని, దిగుబడి పెరుగుతుందని తెలిపారు. మరోవైపు ఎరువులు, విత్తనాల కోసం షాపుల్లో రైతుల తాకిడి పెరిగింది. అయితే నకిలీ విత్తనాల సమస్యపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ శాఖ ఈ ఏడాది ఎలినినో ప్రభావంతో తక్కువ వర్షపాతం ఉంటుందని హెచ్చరించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ వర్షాలు కురుస్తాయని విశ్వసించి, ఒక రెండు వర్షాలకే దుక్కి దున్ని విత్తనాలు వేస్తున్నారు. గతంలో జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలతో పంటలు సమృద్ధిగా దిగుబడి ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని రైతులు గుర్తుచేసుకుంటున్నారు.ఈ ఏడాది వర్షాల పరిస్థితి ఎలా ఉంటుందో దేవునిపై ఆధారపడి రైతులు ఆశలు పెట్టుకున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, ప్లేట్ల పంపిణీ





**ఖానాపూర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఖానాపూర్ మున్సిపల్ పరిధిలోని పద్మావతి నగర్ ఇంద్రనగర్ పాఠశాలలో మున్సిపల్ కౌన్సిలర్ నిమ్మల రమేష్ విద్యార్థులకు ప్రభుత్వము ఉచితంగా సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత దుస్తులు, పుస్తకాలు, నోటుబుక్కులు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు లభిస్తున్నందున తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను పంపాలని సూచించారు. అదే రోజు ఖానాపూర్ మండలంలోని బావాపూర్ కె పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పి. సంతోష్ ఆధ్వర్యంలో సర్పంచ్ పిల్లలకు 100 కొత్త భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. పిటిఏ సమావేశంలో తల్లిదండ్రుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. పాత ప్లేట్లు వాడటం వల్ల పిల్లలకు అనారోగ్యం కలుగుతుందని, అందుకే కొత్త ప్లేట్లు అందజేశామని తెలిపారు.ఈ రెండు కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొని విద్యార్థుల సంక్షేమానికి తీసుకున్న చర్యలను అభినందించారు.

## వర్షంతో జలమయమైన రోడ్లు



**ఖానాపూర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సోమవారం రాత్రి కురిసిన వర్షంతో ఖానాపూర్ పట్టణ కేంద్రంలోని రహదారులు జలమయమయ్యాయి. ముఖ్యంగా నిర్మల్--ఖానాపూర్ బస్టాండ్ ప్రాంతంలో రోడ్డు పూర్తిగా నీటితో మునిగిపోవడంతో కాలిబాటన వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఆంధ్ర బ్యాంక్ వద్ద రోడ్డుపై నీరు ప్రవహించడం వల్ల రవాణా వ్యవస్థ స్తంభించింది. ఇరుకు రోడ్లు, డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడం, రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.రానున్న కాలంలో భారీ వర్షాలు కురిసినట్లయితే రహదారులు చెరువుల్లా మారే పరిస్థితి ఉందని స్థానికులు హెచ్చరిస్తూ, అధికారులు వెంటనే రోడ్డు విస్తరణ, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

## పాఠశాలల్లో విద్యా నాణ్యతపై ప్రత్యేక తనిఖీలు

**ఖానాపూర్, జూన్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:2026--27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతను పెంపొందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసింది. జూలై నుండి ఈ బృందాలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల హాజరు, బోధన విధానం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యత, క్రీడలు, ఆరోగ్య పరీక్షలు, పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించనున్నాయి.ప్రతి పాఠశాలలో బోధన విధానాన్ని తరగతి గదుల్లో ప్రత్యక్షంగా పరిశీలించి, విద్యార్థుల ప్రగతిని విద్యాశాఖ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. మొత్తం 16 అంశాలపై ప్రశ్నావళి ఆధారంగా పర్యవేక్షణ జరుగుతుంది.విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఈ ఏడాది ప్రారంభం నుంచే విద్యా నాణ్యతను పెంపొందించేందుకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించేందుకు ఉపాధ్యాయులు, అధికారులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.

## మంత్రుల రాకతో వెలుగుతున్న లైట్లు



**ఖానాపూర్, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఖానాపూర్ పట్టణ కేంద్రంలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు రాక సందర్భంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హైమాసు లైట్లు నాలుగు రోజులుగా నిరంతరంగా వెలుగుతున్నాయి. శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్ నుండి మార్కెట్ దగ్గర రాజీవ్ గాంధీ విగ్రహం వరకు మూడు కరెంటు పోల్స్‌పై ఏర్పాటు చేసిన లైట్లు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. స్థానికులు మాట్లాడుతూ, తాత్కాలికంగా ఏర్పాటు చేసిన లైట్లను అధికారులు తొలగించకపోవడం వల్ల విద్యుత్ వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు, కరెంటు శాఖ అధికారులు తక్షణమే స్పందించి లైట్లను తొలగించాలని కోరారు. విద్యుత్‌ను అనవసరంగా వృథా చేయకుండా వినియోగిస్తేనే ఉత్పత్తి చేసినంత గొప్పవారవుతారని ప్రజలు వ్యాఖ్యానించారు.

## చైనా బిలియనీర్‌కు 30 ఏళ్ల జైలుశిక్ష విధించిన అమెరికా కోర్టు



**న్యూయార్క్: జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చైనా బిలియనీర్ గువో వెంగుయి కి 30 ఏళ్ల జైలుశిక్ష పడింది. అమెరికాలోని మన్‌హటన్ జిల్లా కోర్టు ఆయనకు ఆ శిక్షను విధించింది. జిల్లా జడ్జీ అనాలిసా టోరిస్ ఆ తీర్పును వెలువరించారు. చైనాలో ఒకప్పుడు సంపన్న వ్యక్తిగా ఉన్న గువో వెంగుయి.. కొన్నేళ్ల క్రితం అమెరికాకు పరారీ అయ్యారు. అయితే అమెరికా వేదికగా చైనా కమ్యూనిస్టు పార్టీని ఆయన విమర్శించేవారు. బిలియన్ డాలర్ల స్కామ్‌లో అమెరికా కోర్టు ఆయనకు ఇవాళ శిక్షను ఖరారు చేసింది. ప్రాపర్టీ టైకూన్‌గా పేరున్న గువో వెంగుయి.. 2017లో చైనాను వీడి అమెరికా వెళ్లారు. అక్కడ కమ్యూనిస్టు పార్టీ విమర్శకుడిగా పేరుగాంచారు. ఆన్‌లైన్‌లో భారీ సంఖ్యలో చైనీయులు ఆయన్ను ఫాలో అయ్యేవారు. అయితే మనీల్యాండరింగ్, ఫ్రాడ్, ముఠా నేరాభియోగాల కింద గువోను అరెస్టు చేశారు.చైనాకు ప్రజాస్వామ్యాన్ని మార్చాలనుకున్న ప్రజలను గువో పీక్కుతిన్నారని న్యూయార్క్ కోర్టు జడ్జీ అనాలిసా తన తీర్పులో పేర్కొన్నారు. చైనీయుల నుంచి ఆన్‌లైన్ ద్వారా డబ్బును దోచుకున్నగువో.. ఆ సొమ్ముతో సంపన్న జీవితాన్ని గడిపారు. చైనాలో రాజకీయ నేతలు అవినీతికి పాల్పడుతున్నారని భారీ ఆన్‌లైన్ ఉద్యమాన్ని నడిపారు. అమెరికా చేరుకున్న తర్వాత వారి నుంచి భారీ మొత్తంలో సొమ్మును రాబట్టారు. అమెరికాలో ఉన్న చైనా కమ్యూనిటీ ప్రజల్ని నమ్మించారు. తన ఫాలోవర్ల నుంచి సుమారు బిలియన్ డాలర్ల మొత్తాన్ని సేకరించారు. 2018 నుంచి 2023 మధ్య కాలంలో ఇన్వెస్ట్‌మెంట్, క్రిప్టో స్కీమ్‌లతో ప్రజల్ని గువో మోసం చేశారు. అమెరికాలో గువో 50 వేల చదరపు గజాల ఇంటిని నిర్మించుకున్నారు. మిలియన్ డాలర్లతో విలాసవంతమైన లాంబోర్గిని కారు ఖరీదు చేశారు. సుమారు 37 మిలియన్ల డాలర్లు పెట్టి ఓ నౌకను సొంతం చేసుకున్నారు. స్వంత అవసరాల కోసం డబ్బును వాడడంతో.. గువోపై విమర్శలు వెల్లువెత్తాయి. కానీ తనకు వచ్చిన నిధులను రాజకీయాల కోసం వాడినట్లు ఆయన చెబుతున్నారు. చైనాను విమర్శించే అమెరికా నేతలతో గువో చేతులు కలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు గతంలో సలహాదారుడిగా చేసిన స్టీవ్ బాననోతో కలిసి ఆన్‌లైన్ వీడియోలు చేశారు. చైనా కమ్యూనిస్టు పార్టీకి వ్యతిరేకంగా ఆ ఇద్దరూ కలిసి పనిచేశారు. ఓ ఫ్రాడ్ కేసులో గత ఏడాది స్టీవ్ బాననోను అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. కానీ మన్‌హటన్ కోర్టులో బానన్ తన నేరాన్ని అంగీకరించారు. గువోపై మొత్తం 12 కేసులు నమోదు చేశారు. సుమారు ఏడు వారాల పాటు ప్రాసిక్యూటర్లు ఆ కేసులను విచారించారు. బోగస్ మాటలతో ప్రజల్ని మోసం చేసినట్లు న్యాయమూర్తులు తేల్చారు.

## స్కూల్ బస్సుపై కూలిన భారీ వృక్షం..

**ఒక విద్యార్థి మృతి..**
**నలుగురికి గాయాలు**



**ముంబై జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహారాష్ట్ర రాజధాని ముంబైలో దారుణం జరిగింది. స్కూల్ బస్సుపై ఒక పెద్ద చెట్టు కూలడంతో ఒక విద్యార్థి మరణించాడు. మరో నలుగురు విద్యార్థులు గాయపడ్డారు. ఈ ఘటన ముంబైలోని చెంబూర్‌లో మంగళవారం మధ్యాహ్నం 2.50 గంటలకు జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. చెంబూర్, రోడ్ నెంబర్ 11లోని యూనివర్సల్ స్కూల్ నుంచి విద్యార్థులు బస్సులో ఇంటికి తిరిగి వెళ్తున్నారు.ఈ క్రమంలో స్కూల్ బస్సుపై ఒక పెద్ద చెట్టు కూలిపోయింది. ఈ సమయంలో బస్సులో ఉన్న 18 మంది విద్యార్థుల్లో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. విద్యార్థులు బస్సులో నలిగిపోయారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ బృందాలు అక్కడికి చేరుకుని విద్యార్థుల్ని బస్సు నుంచి బయటకు తీశారు. ఐదుగురిని ఆస్పత్రికి తరలించగా, ఒక విద్యార్థి మరణించాడు. మిగతా నలుగురికి చికిత్స కొనసాగుతోంది. ప్రమాదం అనంతరం అధికారులు ఘటనా స్థలంలో చెట్టును తొలగిస్తున్నారు. ఈ ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాంతంలో ఉన్న చెట్లను తొలగించాలని బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులకు చెప్పినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవలే ఇలాంటి ఘటన ఇంకోటి జరిగిందని, అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని విమర్శిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఇటీవలి కాలంలో ముంబైలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతున్నాయి.

## బిజినెస్

# భారత మార్కెట్లోకి కొత్తగా N6 స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసిన వన్‌ప్లస్.. ధర ఎంతంటే..!

భారత మార్కెట్లోకి వన్‌ప్లస్ కొత్త చీ6 స్మార్ట్‌ఫోన్ ను విడుదల చేసింది. నార్డ్ సిరీస్‌కు దిగువ స్థాయిలో తీసుకొచ్చిన తొలి 'చీ' సిరీస్ ఫోన్ ఇదే. భారీ బ్యాటరీ, 120HZ డిస్‌ప్లే, తాజా ఆండ్రాయిడ్ వెర్షన్‌తో ఈ ఫోన్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. వన్‌ప్లస్ N6 ప్రారంభ ధర రూ.22,999గా నిర్ణయించింది. ఇందులో 4జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజ్ లభిస్తుంది. 6జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.24,999 గా డిసైడ్ చేశారు.అమెజాన్ ప్రైమ్ డే సందర్భంగా రూ.1,000 ప్రత్యేక తగ్గింపుతోపాటు యాక్సిస్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులపై మరో రూ.2,000 తక్షణ డిస్కౌంట్ అందిస్తోంది. ఆరు నెలల వరకు నో-కాస్ట్ ఈఎంఐ సౌకర్యం కూడా ఉంది. జూలై 4 నుంచి అమెజాన్‌లో విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఫోన్‌లో 6.75 అంగుళాల హెచ్‌డీ ఎల్‌సీడీ డిస్‌ప్లే ఇచ్చారు. 120Hz రిఫ్రెష్ రేట్‌తోపాటు గరిష్ఠంగా 1,200 నిట్స్ బ్రైట్‌నెస్‌ను అందిస్తుంది. ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఆక్సిజన్ ఓఎస్ 16తో ఫోన్ వస్తోంది. రెండు ప్రధాన ఆండ్రాయిడ్ అప్‌డేట్లు, మూడు సంవత్సరాల సెక్యూరిటీ అప్‌డేట్లు ఇస్తామని కంపెనీ ప్రకటించింది. ఫోన్‌లో మీడియాటెక్ డైమెన్సిటీ 6360 అపెక్స్ ప్రాసెసర్‌ను అమర్చారు. వేడి తగ్గించేందుకు పెద్ద వేపర్ చాంబర్ కూలింగ్ వ్యవస్థను కూడా అమర్చింది. ఫొటోగ్రఫీ కోసం వెనుకవైపు 50 మెగాపిక్సెల్ కెమెరా ఇచ్చారు. ముందు భాగంలో 8 మెగాపిక్సెల్ సెల్ఫీ కెమెరా ఉంది. 1080 పిక్సెల్స్ రిజల్యూషన్‌లో 60 ఎఫ్‌పీఎస్ వరకు వీడియోలు రికార్డ్ చేయవచ్చు. డ్యూయల్ వ్యూ వీడియో మోడ్ కూడా ఈ కొత్త ఫోన్‌లో అందుబాటులో ఉంది. ఈ ఫోన్‌లోని 8,000ఎంఏహెచ్ బ్యాటరీ ప్రధాన ఆకర్షణ. ఒకసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే మూడు రోజుల వరకు బ్యాటరీ నిలుస్తుందని కంపెనీ పేర్కొన్నది. 45 వాట్ల ఫాస్ట్ ఛార్జింగ్‌తోపాటు 6.5 వాట్ల రివర్స్ వైర్డ్ ఛార్జింగ్‌కు కూడా మద్దతు ఉంది. ఐపీ65 వాటర్, డస్ట్ రెసిస్టెన్స్‌తోపాటు మిలిటరీ గ్రేడ్ డ్యూరబిలిటీ సర్టిఫికేషన్‌ను కూడా పొందింది.



## నష్టాల్లో ముగిసిన భారత స్టాక్ మార్కెట్..

- సెన్సెక్స్ 250 పాయింట్లు పతనం



భారత స్టాక్ మార్కెట్ మంగళవారం నష్టాల్లో ముగిసింది. మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగియడం వరుసగా ఇది రెండోసారి. బీఎస్ఈ సెన్సెక్స్ 249 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 80 పాయింట్లు నష్టపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఉదయం 77,005.51 వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఒక దశలో 77,037.36 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. చివరకు ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 249.70 పాయింట్లు (0.30) నష్టపోయి 76,478.67 వద్ద నిలిచింది.ఎన్ఎస్ఈ నిఫ్టీ50 80.50 పాయింట్లు (0.34%) నష్టపోయి 23,865.75 వద్ద ముగిసింది. ఐటీ స్టాక్స్ ఒత్తిడికి గురికావడం, అమెరికాకు చెందిన ఎకనామిక్ డాటా, ఫెడరల్ రిజర్వ్ ఇంటరెస్ట్ రేట్, ఇరాన్, అమెరికా మధ్య ఒప్పందం నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. సెన్సెక్స్ సూచీలో టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ఐటీసీ, హిందుస్థాన్ లీవర్ షేర్లు భారీగా నష్టపోయాయి. మరోవైపు బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, అదానీ పోర్ట్స్, టైటాన్, మారుతి సుజుకి సంస్థల షేర్లు లాభపడ్డాయి. వీటిలో మారుతి సుజుకి షేర్లు ఏకంగా 5 శాతం లాభపడ్డాయి. నిఫ్టీలో స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 73.25 డాలర్లుగా ఉంది. మరోవైపు రూపాయి విలువ స్వల్పంగా క్షీణించింది. డాలర్‌తో రూపాయి విలువ 94.66 వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,025.73 డాలర్లుగా ఉంది.

## భారీగా బంగారం ధరలు పతనం.. 18 ఏళ్లలో తొలిసారి!

బంగారం ధరలు భారీగా పడిపోతున్నాయి. జూన్ నెలలో బంగారం ధర 13% పడిపోయింది. 2008 అక్టోబర్ తర్వాత, అంటే గత 18 ఏళ్లలో ఒకే నెలలో ఇంత భారీగా తగ్గడం ఇదే తొలిసారి. వరుసగా గత నాలుగు నెలలుగా బంగారం ధరలు తగ్గుతూనే వస్తున్నాయి. జనవరిలో గరిష్ట స్థాయి నుంచి చూస్తే దాదాపు 30% పడిపోయింది. ఈ నేపథ్యంలో బంగారం కొనడానికి ఇదే సరైన సమయం అని చాలామంది భావిస్తున్నారు. అయితే, ఒకేసారి భారీగా కొనుగోలు చేయడం కంటే, సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా డిజిటల్ గోల్డ్ కొనడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.



# బంగ్లాదేశ్‌ను పడగొట్టిన పేస్ త్రయం..

### టెస్టుల్లో జింబాబ్వేకు భారీ విజయం..!

సుదీర్ఘ ఫార్మాట్‌లో జింబాబ్వే సంచలన విజయంతో అదరగొట్టొంది. స్వదేశంలో జరిగిన ఏకైక టెస్టులో బంగ్లాదేశ్ పై భారీ విజయంతో రికార్డు నెలకొల్పింది. తమను తక్కువ అంచనా వేస్తే భంగపాటు తప్పదని చాటుతూ ఇన్నింగ్స్ 85 పరుగుల తేడా బంగ్లాను చిత్తు చేసింది. పేస్ త్రయం బ్లెస్సింగ్ ముజరబని(4-65), రిచర్డ్ నగరవ(3-32), న్యూమన్ న్యాంహురి(2-28)లు నిప్పులు చెరగగా పర్యాటక జట్టు బ్యాటర్లు క్రీజులో నిలిచేందుకు అష్టకష్టాలు పడ్డారు. సీనియర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీం(34) పోరాడినా సరిపోలేదు. ఫలితంగా మూడో రోజు రెండో సెషన్‌లోనే మ్యాచ్ ముగిసింది.ఇటీవల టెస్టు క్రికెట్‌లో పాకిస్థాన్, వెస్టిండీస్‌పై చరిత్రాత్మక విజయాలతో జింబాబ్వే పర్యటనకు వచ్చిన బంగ్లాదేశ్‌కు పెద్ద షాక్ తగిలింది. చిన్న జట్టే కదా అని తేలికగా తీసుకున్నందుకు భారీ మూల్యం చెల్లిస్తూ ఇన్నింగ్స్ 85 పరుగుల తేడాతో నజ్ముల్ హుసేన్ శాంటో సేన కంగుతిన్నది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూమన్(4-61), ముజరబని(2-19)ల ధాటికి 140కే పరిమితమైన బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబడింది.ఫాలో ఆన్ ఆడిన పర్యాటక జట్టు మూడో రోజు 40/1తో ఆట మొదలెట్టింది. కానీ, బంగ్లాను బ్లెస్సింగ్ ముజరబని(4-65), రిచర్డ్ నగరవ(3-32)లు వికెట్ల వేటతో బంగ్లాను కోలుకోలేని దెబ్బతీశారు. సహచరులు విఫలమైనా.. సీనియర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీం(34) కాసేపు నిలబడ్డాడు. కానీ, రిచర్డ్, ముజరబని ద్వయం ధాటికి టెయిలెండర్లు ఇలా వచ్చి అలా వెళ్లారు. 185 రన్స్‌కే ఆలౌటైన పర్యాటక జట్టు ఇన్నింగ్స్ 85 పరుగుల ఓటమి మూటగట్టుకుంది. ఇదివరకూ అఫ్గనిస్థాన్‌ను సైతం ఇన్నింగ్స్ 75 పరుగుల తేడాతో ఓడించింది జింబాబ్వే.



**కియా శతకంతో..**

తొలి ఇన్నింగ్స్‌లోనే బంగ్లాదేశ్‌ను వణికించిన జింబాబ్వే మ్యాచ్‌పై పట్టు బిగించింది. 36 వద్ద ఓపెనర్లను కోల్పోయిన బంగ్లాను మొమినుల్ హక్(60) అర్ధ శతకంతో ఆదుకున్నాడు. కానీ, న్యూమన్ న్యాంహురి(4-61), ముజరబని(2-19)లు మిడిలార్డర్‌ను పడగొట్టారు. వీరి జోరుకు టెయిలెండర్లు పెవిలియన్‌కు క్యూ కట్టగా. 140కే బంగ్లా కుప్పకూలింది. అనంతరం.. ఓపెనర్ ఇన్నోసెంట్ కియా(140) భారీ శతకంతో చెలరేగగా.. క్రెగ్ ఇర్విన్ 60 పరుగులతో మెరిశాడు. తైజుల్ ఇస్లాం(7-138) రాణించగా ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్ 410 వద్ద ముగిసింది.

## స్పోర్ట్స్

## ముంబైని వీడిన పాండ్యా..

బెంగళూరుకు మారదానికి కారణమిదే..!



భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ముంబైని వీడాడు. ఈమధ్య తరచూ గాయాలతో సతమతమవుతున్న పాండ్యా ఫిట్‌నెస్ కోసం బెంగళూరుకు మకాం మార్చాడు. తొడ కండరాల గాయంతో బాధపడుతున్న ఈ డాషింగ్ బ్యాటర్ బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను తన శాశ్వత శిక్షణ కేంద్రంగా మార్చుకున్నాడు. తద్వారా ప్రస్తుతం బీసీసీఐ కాంట్రాక్టున్న వారిలో.. సీఓఈలో తప్పనిసరిగా ట్రైనింగ్ తీసుకోనున్న తొలి ఆటగాడు పాండ్యానే కావడం విశేషం.గుజరాత్‌లోని బరోడాకు చెందిన హార్దిక్ పాండ్యా గత పదేళ్లుగా ముంబైలో ఉంటున్నాడు. ఐపీఎల్ జట్టు ముంబై ఇండియన్స్‌కు ఆడుతున్న పాండ్యా.. ఫ్రాంచైజీ శిక్షణ కేంద్ర ఘన్సోలీ లో గడిపేవాడు. కానీ, 19వ సీజన్ అనంతరం అతడిని వ్రేట్రేడ్ డీల్ ద్వారా వదులుకోవాలని ముంబై యాజమాన్యం పావులు కదుపుతోంది. ఈ నేపథ్యంలో తిరిగి భారత జట్టులో చోటే లక్ష్యంగా పెట్టుకున్న పాండ్యా ముంబై నుంచి బెంగళూరుకు షిఫ్ట్ అయ్యాడు.వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ ఆడాలనుకుంటున్న ఈ ఆల్‌రౌండర్ ఫిట్‌నెస్ మెరుగుపరచుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇదే విషయంపై బీసీసీఐ వర్గాలు స్పందించాయి. 'హార్దిక్ పాండ్యా ఇదివరకే బెంగళూరుకు షిఫ్టయ్యాడు. సిటీ శివారులో.. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు దగ్గర్లో ఒక భవంతిని అద్దెకు తీసుకున్నాడు. సీఓఈని శాశ్వత శిక్షణ కేంద్రంగా మలచుకున్న ఏకైక ఆటగాడు పాండ్యానే. ముంబైలోని ఇంటి నుంచి శిక్షణ కేంద్రానికి వెళ్లడం పాండ్యాకు ఇబ్బందిగా తోచింది. సెంట్రల్ కాంట్రాక్టున్న ఆటగాడు కాబట్టి అతడు సీఓఈలో ప్రతి సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చు' అని పీటీఐతో వెల్లడించాయి.

## ఏకపక్ష పోరులో చిత్తైన వెస్టిండీస్.. ఎనిమిదోసారి ఫైనల్లో ఆస్ట్రేలియా..!

మహిళల టీ20 ప్రపంచకప్ తొలి సెమీఫైనల్లో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. ఏకపక్ష పోరులో వెస్టిండీస్ పై 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ బేత్ మూనీ(61 నాటౌట్) దూకుడుగా ఆడింది. రెండు వికెట్లు పడినా.. అర్ధశతకంతో కదం తొక్కిన మూనీ.. అషే గార్డ్‌నర్(35 నాటౌట్)తో కలిసి విండీస్ బౌలర్లను సమర్ధంగా ఎదుర్కొంది. నాలుగోసారి సెమీస్‌లో విండీస్‌ను ఓడించిన కంగారూ టీమ్ రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి ఫైనల్లో అడుగుపెట్టింది.ఐసీసీ నాకౌట్స్‌లో తిరుగులేని ఆస్ట్రేలియా మరోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలి సెమీఫైనల్లో వెస్టిండీస్‌ను వణికించిన ఆసీస్.. స్వల్ప లక్ష్యాన్ని ఆడుతూపాడుతూ ఛేదించింది. 2012లో 2014లో, 2018లో కరీబియన్ టీమ్‌ను సెమీస్‌లోనే ఇంటికి పంపిన కంగారూలు ఈసారి కూడా పైచేయి సాధించారు. 126 పరగులు ఛేదనలో ఓపెనర్ జార్జియా వోల్(16), ఫొబె లిచ్‌ఫీల్డ్(4)లు త్వరగానే ఔటైనా.. బేత్ మూనీ(61 నాటౌట్) నిలబడింది.క్లాక్స్‌టన్ వేసిన 6వ ఓవర్లో నాలుగు ఫోర్లతో మూనీ రెచ్చిపోవడంతో.. ఆసీస్ పవర్ ప్లేలో రెండు వికెట్ల నష్టానికి 63 రన్స్ కొట్టింది. అష్ గార్డ్‌నర్(35 నాటౌట్) మరో ఎండ్‌లో యాంకర్ రోల్ పోషించగా మూనీ మైదానం నలువైపులా షాట్లతో అలరించి స్కోర్ బోర్డును ఉరికించింది. 29 బంతుల్లోనే అర్ధ శతకం సాధించిన తను.. గార్డ్‌నర్‌తో హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పింది. వీరిద్దరూ క్రీజులో పాతుకుపోవడంతో ఆసీస్ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది.




**ఓపెనర్ల తడబాటు**

భారీ స్కోర్ కొట్టాలనుకున్న వెస్టిండీస్‌కు ఆస్ట్రేలియా బౌలర్లు షాకిచ్చారు. టాస్ ఓడి ఇన్నింగ్స్ దూకుడుగా ఆరంభించినా హేలీ మాథ్యూస్(30)ను ఆసీస్ స్పిన్నర్లు సమర్ధంగా నిలువరించారు. నాలుగో ఓవర్లో కిమ్ గార్త్, ఐదో ఓవర్లో లూయిస్ హామిల్టన్ ఒక్కో పరుగే ఇచ్చారు. మరో ఎండ్‌లో క్వియానా జోసెఫ్(16).. తడబాటుతో పవర్ ప్లేలో విండీస్ 35 రన్స్ చేసింది. ఆసీస్ బౌలర్లు వరేహం(2-17) తొలి బంతికే మాథ్యూస్(30)ను బౌల్డ్ చేసింది. 47 వద్ద తొలి వికెట్ పడగా.. క్రీజులోకి వస్తూనే షెమైనే క్యాంప్‌బెల్(22) రెండు ఫోర్లు బాదింది. కానీ, తర్వాత మొలినెక్స్ ఓవర్లో సిక్సర్‌కు యత్నించిన జోసెఫ్ నేరుగా సథర్‌లాండ్ చేతికి చిక్కింది.

**గార్డ్‌నర్ డబుల్..**

ఓపెనర్లు వెనుదిరిగిన షాక్ నుంచి తేరుకోక ముందే గార్డ్‌నర్ విండీస్‌ను మరింత ఒత్తిడికి గురి చేసింది. 11వ ఓవర్లో డేంజరస్ స్టెఫానీ టేలర్(0), క్లాక్స్‌టన్(0)ల వికెట్లు తీసి మరింత కష్టాల్లోకి నెట్టింది. ఆ దశలో చినొల్లే హెన్రీ(10) జతగా క్యాంప్‌బెల్ జట్టును ఆదుకోవాలనుకుంది. అయితే.. ఈ ఇద్దరూ త్వరగానే ఔటవ్వడంతో.. విండీస్ వందలోపే పరిమితమయ్యేలా కనిపించింది. ఆఖర్లో డియాండ్ర డాటిన్(22 నాటౌట్) మెరుపులతో స్కోర్ దాటించింది. దాంతో, నిర్ణీత ఓవర్లలో వికెట్ల నష్టానికి కరీబియన్ టీమ్ 125 రన్స్ చేయగలిగింది.